

నేటి దినపత్రిక
# సూర్య
ఉత్తరాంధ్ర
సోమవారం 20-1-2025 పేజీలు 9
www.suryaa.com
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం శ్రీకాకుళం


## సమాచార చేరవేతలో..
# మీడియా బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలి

-ఏఐ వినియోగంతో కలిగే ప్రయోజనాలపై న్యాయకోవిదులు విశ్లేషణ చేసుకోవాలి -జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో చర్చించిన సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు



**విశాఖపట్నం, జనవరి 19, మేజర్‌న్యూస్**

కోర్టులు - మీడియా పరస్పర సహకారంతో, సమన్వయంతో పని చేయాల్సి ఉందని, జవాబుదారీ తనంతో కూడిన పనితీరును ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సుప్రీం కోర్టు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు పేర్కొన్నారు. జ్యుడీషియరీ అండ్ మీడియా అనే అంశంపై జరిగిన మేథోపరమైన చర్చలో పలు అంశాలపై వారి ఆలోచనలు పంచుకున్నారు. ట్రయిల్ కోర్టులో, ఇతర న్యాయపరమైన అంశాల్లో మీడియా పాత్ర ఎలా ఉండాలి, దాని పరిధి, పరిమితులపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో జరిగిన సంఘటలను సోదాహరణంగా వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భావితర జడ్జీలు ఎలా వ్యవహరించాలి అనే కోణంలో విశ్లేషణ చేశారు. పలు అంశాలపై సీనియర్ న్యాయమూర్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. విశాఖపట్టణం ఏయూ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన సౌత్ జోన్-2 రెండు రోజుల జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో భాగంగా రెండో రోజు ఆదివారం జ్యుడీషియరీ అండ్ మీడియా, అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ థ్రూ ఎమెర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్ అనే అంశాలపై చర్చ నిర్వహించారు. ముందుగా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన కోర్టులు - మీడియా పాత్ర అనే అంశంపై చర్చ జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య వ్యవహరించారు. పీపీటీ ద్వారా పలు అంశాలపై వివరణ ఇచ్చారు. అనంతరం అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ పై జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన చర్చ జరగ్గా... కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎం. ముస్తాక్యు, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సుందర్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ విధానాలను వివరించారు.

**విశ్వసనీయతను కలిగి ఉండాలి : జస్టిస్ కురియన్ జోసెఫ్**

మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ పేర్కొన్నారు. అదే పరస్పర సహకారానికి ప్రామాణికంగా నిలుస్తుందన్నారు. రెండు అంశాలపై జరిగిన చర్చా వేదికలను ప్రారంభించిన ఆయన కోర్టు వ్యవహారాల్లో, సమాచార చేరవేతలో మీడియా పాత్ర, తీర్పులు, ఇతర ప్రొసీజరల్ అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర గురించి సుదీర్ఘంగా మాట్లాడారు. వాటి ఆవశ్యతను తెలుసుకోవాలని, వినియోగంపై విశ్లేషణ చేసుకోవాలని పేర్కొన్నారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాలు ప్రస్తుతం పోషిస్తున్న పాత్రపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తులకు సూచించారు. ప్రాంతీయ సదస్సులో భాగంగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ ఫోర్త్ ఎస్టేట్ గా ప్రాచుర్యం సంపాదించుకున్న మీడియాలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయని, కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం మిగతా 2లో

# అనకాపల్లి కేంద్రంగా అధికారుల అండతో అక్రమ మైనింగ్!

-సర్వే నంబర్ 84పై ఎందుకంత ప్రేమ
-వేటజంగాలపాలెం క్వారీలపై వేటు వేయలేరా?
-కిక్కురుమనని రెవెన్యూ, పంచాయతీ, మైనింగ్, పోలీసు అధికారులు



**అనకాపల్లి, జనవరి 19, మేజర్‌న్యూస్**

అనకాపల్లి జిల్లా కేంద్రం పరిధిలోని వేట గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 84పై అధికారులు పట్టనంత ప్రేమ ఒలకబోస్తున్నారు. బహిరంగంగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రోడ్డు మెటల్ తవ్వి తరలించుకుపోతున్నా పాపం సంబంధిత అధికారుల దృష్టికి రాకపోవడం శోచనీయం. పట్టపగలు బాంబులతో బ్లాస్టింగులు చేతున్నా అధికారుల చెవికి తాకకుండా ధ్వని తరంగాలు ఏ వైపు పోతున్నట్టు? క్వారీలలో అనుమతులు లేకుండా బ్లాస్టింగులను అరికట్టవలసిన భాధ్యత పోలీసులపై లేదా? అనకాపల్లి మండల పరిధిలో కనీస అర్హత, అవగాహన లేకుండా రోజు కూలీలే బ్లాస్టర్స్ పాత్ర పోషిస్తుండడంతో ప్రమాదాలు పెచ్చు మిరుతున్నాయి. అనుమతులతో సంబంధం లేకుండా ఇష్టానుసారం బ్లాస్టింగ్ మెటీరియల్ సరఫరా చేసేస్తున్నారు. అసలు బ్లాస్టింగ్ మెటీరియల్ సరఫరాకు పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారా? ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యవేక్షించాల్సిన పోలీసులు ఎంచేస్తున్నట్టు? గ్రామ రెవెన్యూ స్థాయిలో ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది కనీసం చూస్తు న్నారా? చూస్తే చర్యలేవీ? తహసీల్దార్ దృష్టిలో కొండ పోరంబోకు భూములు, గనులు ప్రభుత్వ ఆస్తులు కాదా? వాటిని కాపాడవలసినది రెవెన్యూ వర్గాలే కదా?. మరెందుకు ఇప్పటికీ ఒక కేసు నమోదు చేయలేదు?. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా అనుమతులు లేని క్వారీ, క్రషర్ లపై పంచాయతీ కార్యదర్శిలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఒక అధికారి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదు? అక్రమ మైనింగ్ పై జిల్లా పంచా యతీ అధికారి పర్యవేక్షణ లోపిస్తుందా? పలు పంచాయతీల్లో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కదల్లేని, నోటీసులు జారీ చేయలేని పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శిలు ఉన్నారని అనడంలో వాస్తవం ఎంత?. ఇంత జరుగుతున్నా మాకేటి? అన్న చందంగా కార్యాలయాలకు పరిమితం అవుతున్న అనకాపల్లి మైన్స్ అధికారులు. ఒక పక్క రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారులు లేదా విశాఖ విజిలెన్స్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా అనకాపల్లి మైన్స్ అధికారులకు పట్టదా? పలానా క్వారీ, పలానా క్రషర్ అని ఫిర్యాదు చేస్తేనే దాడులు చేస్తారా? ప్రతి నెల చేకింగులు నిజంగా చేస్తే అక్రమ మైనింగ్ పై ఒక్కసారి అయినా కేసు నమోదు అవ్వదని చెప్పగలరా? జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ మైనింగ్ నిర్వాహకులు పైన, నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. అలాగే వేట జంగాలపాలెం 84 సర్వే నెంబర్లో అక్రమ మైనింగ్, ఎర్ర రాయి, రోడ్డు మెటల్ చోరీ, అంతకు మించి జరుగుతున్న గ్రావెల్ మాఫీయా ఆట కట్టించాలని, అక్రమ మైనింగ్ కోసం వినియోగిస్తున్న వాహనాల పైన చర్యలు తీసుకునే విధంగా జిల్లా రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



# సందర్శకులను ఆకట్టుకునేలా అరకు ఉత్సవ్ 'చలి'

## అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



**పాడేరు, జనవరి 19, మేజర్‌న్యూస్**

సందర్శకులను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా చలి పేరుతో అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఆదివారం సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. స్థానికంగా తాజంగి, లంబసింగి, వనజంగి, కొత్తపల్లి జలపాతాలు, చాపరాయి లాంటి ప్రదేశాలతో కూడిన వీడియోలను అరకు ఉత్సవ్ ప్రమోషన్ క్యాంపైన్లో చూపించా లన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళారూపాలను రోజువారి కార్యక్రమాలను రూపొందించాలన్నారు. వారికి అవసరమైన వసతి, భోజన, రవాణా ఏర్పాట్లను చూడా లన్నారు. అందుకు తగిన విధంగా కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యతలను అప్పగించాలని సూచించారు. నోడల్ అధికారులకు వారి విధులు, బాధ్యతలు స్పష్టం చేయాలని ఆదేశించారు. విశాఖపట్నం నుండి అరకు వచ్చే వెళ్లే వారికి ట్రావెల్ ఆపరేటర్లతో మాట్లాడి సీట్లను బట్టి ఒక ధరను నిశ్చయించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆనరోరియం, వేదిక, బారికేడ్లు, రవాణా, వసతి, భోజన సౌకర్యాలు కల్పనకు, బడ్జెట్ అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు ప్రోటోకాల్ ప్రకారం సిద్ధం చేయాలన్నారు. అరకు ఉత్సవంలో స్ట్రీట్ లైట్లు, వెల్కమ్ ఆర్చులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు తదితర అంశాలకు జీవీఎంసీ సహకారం తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో వివిధ ప్రదేశాల నుండి సమర్ధ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ, పాడేరు ఐ టి డి ఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, సిపిఓ ఎస్ ఎస్ ఆర్ కె పట్నాయక్, స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ శంకర్రావు, ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ వి. మురళి, అరకు తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**విజయనగరం క్రైం , జనవరి 19, మేజర్‌న్యూస్**

విజయనగరం జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా శనివారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న 252 మంది మందుబాబులపై కేసులు నమోదు చేసారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలను చేపట్టి, పశువులను, మద్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై రెండు కేసులు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 8మద్యం బాటిళ్ళు, 4పశువులను, ఒక వ్యాను సీజ్ చేసారన్నారు. వాహన తనిఖీల్లో రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై 386 కేసులు నమోదు చేసి, రూ.95,205/- లను ఈ-చలానాగా







# విశాఖలో ప్లాస్టిక్ నిషేధానికి..
# సోషల్ మీడియా ప్రభావశీలుల సహకారం స్ఫూర్తిదాయకం

## జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

**విశాఖపట్నం, జనవరి 19, మేజర్‌న్యూస్**

విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి చైతన్యవంతంతో సహకరిస్తూ ముందడుగు వేసిన సామాజిక మాధ్యమ ప్రభావశీలులు (సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్) అందించిన సామాజిక సహకారం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ, వైజాగ్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్నాకమ్యూనిటీ, మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ సమీపంలో నిర్వహించిన 'ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్' కార్యక్రమానికి పుష్ప-2 చిత్రం నటి కుమారి పావని, జీవీఎంసి అధికారులతో కలిసి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స ర్స్ ముందుకు వచ్చిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స ర్స్ సామాజిక బాధ్యతతో అందిస్తున్న సహకారం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు కమిషనర్ తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విశాఖ నగరంలో 2025 జనవరి ఒకటి నుండి నిషేధించడమైనదని, అందుకు ముందస్తుగా 45 రోజులు పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించేలా ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించడమైనదన్నారు. నగరంలో ప్లాస్టిక్ వస్తువులను అన్నిటినీ జీవీఎంసీ నిషేధించలేదని,ఈ విషయాన్ని ప్రజలందరూ ముఖ్యంగా గమనించాలని, ఏవైతే ప్లాస్టిక్ వస్తువులు తిరిగి పునరుత్పత్తికి ఉపయోగపడని ప్లాస్టిక్ వస్తువులను మాత్రమే నిషేధించడమైనదని, అనగా 120 మైక్రాన్ల లోపు ఉన్నటువంటి ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా విశాఖ నగరంలో నిషేధించడమైనదని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు ప్రతి మనిషి జీవితంలో విడదీయరాని బంధంతో ముడిపడిపోతున్నా యన్నారు. మైక్రో ప్లాస్టిక్స్ మనకు తెలియకుండానే శరీరంలోకి వెళ్తూ క్యాన్సర్ కి కారణాలవుతున్నాయన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నగరంలో ప్రతి చోట, కాలువలలో, ప్రధాన గెడ్డలలో చిక్కుకొని ఒక ప్రధాన సమస్యగా పర్యావరణానికి హాని కలిగిస్తూ జీవీఎంసీ కి ఆర్థిక భారంగా ఉంటున్నాయన్నారు.ఒక్క విశాఖ నగరంలోనే ఒక్క రోజుకు 15 టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు ప్రజలు వినియోగిస్తున్నారన్నారు. వాటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన వస్తువులను ఉత్పత్తి ,సరఫరా చేసుకునేందుకు ఉత్పత్తిదారులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వారికి కల్పించేలా జీవీఎంసీ చర్యలు చేపడుతుందని, ప్రజలకు అవగాహన కల్పిస్తూనే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యాపారం, వినియోగం ,ఉత్పత్తి, సరఫరాదారులపై తదుపరి జరిమానాలు విధించడమే కాకుండా చట్టపరమైన చర్యలు కూడా చేపట్టబడతాయని కమిషనర్ తెలిపారు. విశాఖ నగర పర్యావరణాన్ని కాపాడుతూ, ప్లాస్టిక్ రహిత నగరంగా దేశంలోనే విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు, విశాఖ నగరాన్ని అభివృద్ధి పదములు తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ యంత్రాంగం నిత్యం కృషి చేస్తుందని, అందుకు ప్రజా సహకారమే ఇటువంటి కార్యక్రమాలు ముఖ్య భూమిక అని ఆ దిశగా ప్రజలందరూ నగర అభివృద్ధి సహకరించాలన్నారు. అనంతరం మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్నా కమ్యూనిటీ యాజమాన్యం సామాజిక బాధ్యతతో 100 అడుగుల 'లెట్ యజ్ మేక్ ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్' అని క్లాత్ బ్యానర్ రూపొందించి ఆర్కే బీచ్ మత్స్యదర్శిని ప్రాంతం నుంచి జీవీఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీప బీచ్‌లో మిగతా 2లో



## విశాఖలో ప్లాస్టిక్ నిషేధానికి..




(మొదటి పేజీ తరువాయి)

'ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్' పేరున ఏర్పాటు చేసిన "సాండ్ ఆర్ట్" వరకు వాక్ థాన్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స్ ర్స్, సినీనటి పావని జీవీఎంసీ అధికారులతో కలిసి పాల్గొని , బీచ్ లో వ్యర్థాలను వెలికి తీశారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి సహకరించిన అందరికీ కమిషనర్ అభినందనలు తెలిపారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన క్రంచి బిస్కెట్ కప్స్ ఉత్పత్తిదారులు విశాఖ నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రేరణ పొంది, ప్లాస్టిక్ పొర కలిగిన టీ /కాఫీ కప్పులు, ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగే వారికి ప్రత్యామ్నాయంగా రాగి పిండితో తయారుచేసిన క్రంచి బిస్కెట్ టీ కప్పులను ఉత్పత్తి చేస్తూ ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ "టీ తాగండి -కప్పు తినండి "అనే నినాదంతో ఏర్పాటు చేసిన "టీ "ని సరఫరా చేయగా ఆ క్రంచీ కప్పులో జీవీఎంసీ అధికారులతో కలిసి కమిషనర్ "టీ" ను సేవించి స్ఫూర్తిని కలిగించారు. ఇటువంటి సామాజిక స్పృహ కలిగిన క్రంచి కప్స్ ఉత్పత్తిదారులైన పొన్నాడ మణికుమారి, అలమూరి ఖేజియా లను అభినందించారు. అనంతరం విశాఖ నగరానికి చెందిన పుష్ప-2 చిత్రం సినీనటి కుమారి పావని మాట్లాడుతూ విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించిన జీవీఎంసీ యంత్రాంగానికి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మనిషిని ఈ ప్లాస్టిక్స్ ఆడంబరంగా ఆకర్షిస్తూ సకల మానవాళికి, మూగజీవుల ప్రాణాలకు హాని కలిగిస్తున్నాయని ,వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు, భావితరాలకు భవిష్యత్తు బాటవేసెలా మన పర్యావరణాన్ని కాపాడే దిశగా ఒక బృహత్తర కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రారంభించి నిర్వహిస్తున్నందుకు విశాఖ వాసులుగా మనమందరం మన ఆరోగ్యాలను మంచి పర్యావరణాన్ని కాపాడుకునేందుకు జీవీఎంసీ కి విశాఖ నగర ప్రజలందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్. వి నరేష్ కుమార్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన కలిగే అనర్థాలు ,ప్రత్యామ్నాయాలు వినియోగం వలన కలిగే లాభాలు, లభిస్తున్న వస్తువులు తదితర విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్.ఎస్ .వర్మ ,డి.వి. రమణమూర్తి, జోనల్ కమిషనర్ కె .శివప్రసాద్, సహాయ వైద్యాధికారులు డాక్టర్లు కిరణ్ కుమార్, సునీల్ కుమార్, అప్పలనాయుడు, 600 మందికి పైగా సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్, మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్ ప్రతినిధులు, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్నా కమ్యూనిటీ సభ్యులు, జీవీఎంసీ ఉద్యోగులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార చేరవేతలో..



(మొదటి పేజీ తరువాయి)

చూపిస్తున్నాయన్నారు. ప్రజల గొంతుకగా పని చేస్తున్న మీడియా మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉందని పేర్కొన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను వార్తలుగా రాయకూడదని, నిజాలను నిర్ధారించుకొని వాస్తవాలను వార్తలుగా ప్రచురించాలని హితవు పలికారు. సున్నితమైన అంశాల్లో ఆచితూచి వ్యవహరించాలని, పరిస్థితులను అర్థం చేసుకొని నడుచుకోవాలని సూచించారు. ట్రయల్ అంశాలను ముందుగా బహిర్గత పరచకూడదని, ప్రతికూల ప్రభావాలను చూపరాదని హితవు పలికారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పని చేసే వారంతా మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కోల్ కతాలో జరిగిన ఆర్జీకర్ ఆసుపత్రి ఘటన, ఇతర ఘటనల్లో మీడియా వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాకున్న పరిమితుల గురించి ఇరు వర్గాలూ తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీ అంశాలను వివరిస్తూ భవిష్యత్తులో వాటిని ఉదాహరణగా తీసుకొని జాగ్రత్త వహించాలన్నారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సుందర్ విశ్లేషణ చేశారు. ఏఐ అనేది న్యాయమూర్తులకు సహకారిగా మాత్రమే ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు ఏఐ టెక్నాలజీని పరిగణనలోకి తీసుకోవచ్చని, కానీ దానినే తుది నిర్ణయంగా, అంతిమ ప్రామాణికంగా తీసుకోరాదని సూచించారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం. ముస్తాక్య బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి మాట్లాడారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ టెక్నాలజీ గురించి పీపీటీ ద్వారా వివరించారు. ఈ- కోర్టు రూముల గురించి, సాంకేతిక సిబ్బంది సహకారం గురించి తెలిపారు. కేరళలో కోర్టు వ్యవహారాల నివేదికలను రూపొందించేందుకు ఏఐ, గూగల్ నోట్ బుక్ సాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. ఏఐ వినియోగంలో సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సదస్సు ముగింపు సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ జ్యుడీషియల్ అకాడెమీ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ వందన సమర్పణ చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ, ఇతర సీనియర్ న్యాయమూర్తులు, హైకోర్టు, జిల్లా కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

విధించారన్నారు. అదే విధంగా సంతకవిటి పోలీసు స్టేషను పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై రైడ్ చేసి, పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి బెట్టింగులకు వినియోగించిన రూ. 16,080/- ల నగదు సీజ్ చేసారని జిల్లా ఎస్పీ తెలిపారు. వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై 29 కేసులు నమోదు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# పర్యాటకులకు అందుబాటులో పారా గ్లైడింగ్

## పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్

అరకులోయ, జనవరి 19, మేజర్ న్యూస్:

ఆంధ్రా ఊటీ అంద చందాల అరకులోయను సందర్శించే దేశ,విదేశీ పర్యాటకులకు పారా గ్లైడింగ్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. పర్యాటకుల వినోదం కోసం అరకులోయలో ఈ నెలాఖరు నుంచి నిర్వహిస్తున్న చలి ఉత్సవ్ సందర్భంగా ప్రత్యేకంగా పారా గ్లైడింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అరకులోయ మండలంలోని మాడగడ మేఘాల కొండ వద్ద పారా గ్లైడింగ్ ను ఆదివారం ప్రయోగాత్మకంగా నిర్వహించామన్నారు.హిమాచల్ ప్రదేశ్ ఆరెంజ్ పారాగ్లైడింగ్ స్కూల్ పైలెట్,శిక్షకులు విజయ్ సోనీ, నేతృత్వంలో పారా గ్లైడింగ్ ట్రైనీ పైలెట్ అలీషా నిర్వహించిన పారా గ్లైడింగ్ ట్రయల్



సక్సెస్ అయినట్లు ఆయన చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ సూచనల మేరకు పారా గ్లైడింగ్ నిర్వహించామన్నారు.పారా గ్లైడింగ్ నిర్వహణకు ఈ ప్రాంతం అత్యంత అనుకూల ప్రదేశమని,పారా గ్లైడింగ్ లో విహరించే పర్యాటకులకు కొత్త అనుభూతిని పొందుతారని ఆయన తెలిపారు. చలి ఉత్సవ్ ప్రారంభం నుంచి పర్యాటకులకు పారా గ్లైడింగ్ అందుబాటులో ఉంటుందని, ఈ వినోద భరితమైన అవకాశాన్ని పర్యాటకులంతా సద్వినియోగపరచుకొని ఆహ్లాదంగా గడపాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ కోరారు.

## గుర్తుతెలియని మహిళ మృతి

బాడంగి, జనవరి 19, మేజర్ న్యూస్:



మండలంలోని గొల్లాది రైల్వే గేటు సమీపములో రైల్వే ట్రాక్ పై మహిళ సుమారు 40 నుండి 50 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహం సుమారు 5 అడుగుల ఎత్తు కలిగి, చామన ఛాయరంగు ఉండి, దుస్తులు: పసుపు రంగు పై ఆకుపచ్చ, ఎరుపు రంగు మచ్చలు కలిగి సిమెంట్ రంగు బోర్డర్ కలిగిన చీర పసుపు రంగు లంగా ఎరుపు రంగు జాకెట్ కలవు.దొంకిన వలస , బొబ్బిలి రైల్వే స్టేషన్ ల మధ్య, గొల్లాది రైల్వే గేట్ దగ్గరలో రైల్వే ట్రాక్ మధ్యలో మహిళ మృత దేహం పడి వున్నది దీనిని ఆదివారం ఉదయం సుమారుగా ఉదయం 11 గంటల ప్రాంతంలో అటువైపుగా వచ్చిన గూడ్స్ రైలు గార్డు మృతదేహమును చూసి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు ఈ మేరకు సాదరు మహిళ ఏదయినా గుర్తు తెలియని రైలు బండి నుండి జారి పడిపోయడం వల్ల గాని గుద్దడం వల్ల గాని తగిలిన గాయలతో చనిపోయి వుండవచ్చు , అని విజయనగరం జి ఆర్ పి ఆర్ పి ఎస్ ఐ వి బాలాజీ రావు కేసు నమోదు చేసారు, ఆయన దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం విలేకరులకు తెలిపారు ఎవరికైనా ఆచూకీ తెలిసినవారు తాను ను సంప్రదించండి అని ఆయన తెలిపారు 9490617089 మొబైల్ నెంబర్ కు కానీ 0891-2883218 ల్యాండ్ లైన్ నెంబర్ కు కాల్ చేసి తెలియజేయవలెను అని ఆయన అన్నారు మృతదేహమును విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

## 36 సంవత్సరాల తర్వాత అపూర్వ కలయిక



మెలియాపుట్టి. జనవరి 19, మేజర్ న్యూస్ :

మెలియాపుట్టి మండలం చాపర జిల్లా పరిషత్ హై స్కూల్ లో 1989-1990 విద్యా సంవత్సరాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై ఆదివారం కలుసు కున్నారు. దీనికి చదువుకున్న హై స్కూల్ ఆవరణే వేదికైంది. 36 సంవ త్సరాల తరువాత కలుసుకున్న వీరంతా ఒకరినొకరు అప్యాయం గా పలకరించుకున్నారు. తమ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యా పకులను ఘనముగా సత్కరించి గౌరవించారు.

## అమిత్ షా రాజీనామాకు సిపిఎం డిమాండ్




అరకులోయ, జనవరి 19, మేజర్ న్యూస్:

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) డిమాండ్ చేసింది.భారత కమ్యూనిస్టు పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు సిపిఎం మండల కమిటీ అమిత్ షా వ్యాఖ్యలకు ఆదివారం నిరసన వ్యక్తం చేసింది.స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సిపిఎం పార్టీ నాయకులు,కార్యనిర్వాహక సభ్యులు కలిసి హోంమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకుడు కిండంగి. రామారావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను అవమానిస్తూ పార్లమెంట్లో హోంమంత్రి చేసిన వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ను అవమానించిన హోంమంత్రి పై కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. హోం మంత్రి వ్యాఖ్యలు సరైనది కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కనీసం ఖండించకపోవడం బాధాకరమని కిండంగి.రామారావు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కిల్లో. జగన్నాథం, కొర్ర.మగ్గన్న, పాంగి.బాలకృష్ణ, చిన్న, లైకోన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు గాయాలు

రామభద్రపురం, జనవరి 19, మేజర్ న్యూస్:

ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడు గాయాలు అయినట్లు ఏ ఎస్ ఐ ఆర్ అప్పారావు తెలిపారు ఆయన వివరాల ప్రకారం విశాఖపట్నం షీలా నగర్ కు చెందిన బంకుర్ బాబ్జి 73 సంవత్సరాలు సంక్రాంతి పండుగ నిమిత్తం మండల కేంద్రంలో పూడివేదిక చెందిన తనకు బంధువైన కుంనుకు గౌరీ శంకర్ ఇంటికి వచ్చాడు పండుగ అనంతరం ఆదివారం బొబ్బి.లి ల్లో తన మేనకోడలు ఇంటికి వెళ్లి ఎందుకు స్కూటీపైపయాన్ అవ్వగా చౌక్కా పు వాడి చెరువు వద్ద వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన డంతో గాయాలు పాలయ్యాడని తెలిపారు వెంటనే 108 ద్వారా బడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అప్పారావు తెలిపారు.

## సుందరాడలో వరి కుప్పల దగ్ధం

### సుమారు ఐదు లక్షల లక్షల ఆస్తి నష్టం అంచనా

తెర్లాం, జనవరి 19, మేజర్‌న్యూస్



మండల పరిధిలోని సుందరాడ గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో వరి కుప్పల దగ్ధం కాగా సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు అన అధికారులు అంచనా.. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ప్రమాదంలో ముత్తా తిరుపతి రేజేటి లక్ష కు సుమూరుపెంటయ్య ముత్తా నాగేష్ లవి ధాన్యం తో ఉన్న వరి కుప్పలు కాలి బూడదయ్యాయి. గ్రామ సమీపంలో ఉన్న పనుకు రాయి మీద వేసుకున్న వరి కుప్పలు కు అగ్గి తగిలి మంటలు చెలరేగడంతో గ్రామస్తులు పరుగున వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా మంటలు అదుపు చేయడానికి ఎంతో శ్రమించినా ఫలితం కానరాలేదు. వెంటనే రాజాం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేయ గలిగారు. జరిగిన సంఘటనపై మండల రెవెన్యూ అధికారులు కు వీఆర్వో సమాచారం అందించగా జరిగిన నష్టం పైన అంచనాలు తయారు చేశారు. జరిగిన సంఘటనపై బాధితులు తమకష్టపడి పండిచుకున్న పంట కాలి బూడదైందని కన్నీట పర్వంత మయ్యారు.

## పశువులకు ప్రత్యేక వైద్య శిబిరాలు

### నేటి నుండి గ్రామాల్లో ప్రారంభం

ఆమదాలవలస రూరల్, జనవరి 19, మేజర్‌న్యూస్

ఆమదాలవలస మండలంలో నేటి నుండి ఈనెల 31 వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ శాఖ కొత్తవలస ఆసుపత్రి వైద్యుడు ఓంకార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, తమ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలో రెండు బృందాలుగా వీడి పశువైద్య శిబిరాలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ శిబిరాల్లో పశువుల్లో వచ్చే నోటి సంచ, గాలికుంటు వ్యాధి సంబంధించి వ్యాక్సిన్లు వేయడంతో పాటు గర్భకోశ వ్యాధులకు వైద్య సేవలు అందించడం మగ పశువులకు విత్తలు నొక్కుట, గొర్రెలు మేకలకు వ్యాధి నివారణకు టీకాలు వేయటం, ఇతర సాధారణ చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. 20 తేదీన అక్కులపేట కొత్తవలస, 21 శ్రీనివాసచార్యుల పేట, బెలమాం,22 చింతలపేట, దూసి,23 కొర్లకోట, కొరపాం,24 టీజొన్నవలస, గరిమెళ్ళ కొత్తవలస, 25 కనుగులవలస, 27 వంజంగి, తొగరాం, 28 తోటాడ, చీమలవలస, 29 గాజుల కొల్లివలస, కటియాచార్యుల పేట, 30 న రామచంద్రాపురం, నిమ్మతొర్లాడ, 31 చిట్టివలస, నెల్లిపర్తి, వెధుల్లవలస గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా గో బ్యాక్

### రాస్తారోకో చేపట్టిన వామపక్షాలు

బొబ్బిలి, జనవరి 19, మేజర్ న్యూస్:

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్'ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ వామపక్ష నేతలు నిరసన తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జెండామాల్ జంక్షన్లో ఆదివారం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, కోట అప్పన్న మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసి అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా రాష్ట్ర పర్యటనను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం, సీపీఐ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏమి సాధించారని పోటీలుపడి సంబరాలు..?

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ ఎద్దేవా

విశాఖపట్నం, జనవరి 19, మేజర్‌న్యూస్

విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు, అనే ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదానికి ఈ ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం కర్రు కాల్చి వాత పెట్టి, వెన్నపూస రాసి, గాయానికి తాత్కాలిక ఉపశమనం కలిగించి.. మేమే గొప్ప ఏదో సాధించేసామని పోటీలు పడి సంబరాలు చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ ఎద్దేవా చేశారు. ఆదివారం ఉదయం ఇక్కడ లలితా నగర్ లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018వ సంవత్సరంలోనే బిజెపి కేంద్రంలోను, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగానే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్ అంశాన్నితెరమీదకి తీసుకొని వచ్చారని, తదనంతరం 2021 వ సంవత్సరంలో క్యాబినెట్లో ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది అని,దీనికి కర్తా, కర్మ, క్రియ భారతీయ జనతా పార్టీ అని అలాంటి భారతీయ జనతా పార్టీతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో జత కట్టిన తెలుగుదేశం పార్టీ మరియు జనసేన పార్టీలు ఎన్డీఏ కూటమిగా ఏర్పడి ఈ ఆంధ్రప్రదేశ్లో అధికారంలోకి రావడం జరిగింది. 2019 వ సంవత్సరం లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం మరియు జనసేన పార్టీలు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తాం, ఆంధ్రుల సెంటిమెంట్ను గౌరవిస్తామని వాగ్దానాలు చేసి అధికారం లోకి రావడం జరిగింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను గాలికి వదిలేసి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 11440 కోట్ల ఉద్దీపన ప్యాకేజీకి తల ఊపి ఏదో సాధించాం అని చెప్పి తెలుగుదేశం జనసేన పార్టీలు పోటీ పడడం చూస్తుంటే చాలా హాస్యాస్పదంగా ఉందని తెలియజేశారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వాము లుగా ఉన్న భారతీయ జనతా పార్టీని ఒప్పించ వలసిన బాధ్యత టిడిపి, జనసేన పై ఉందని లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వంలో తమ మద్దతును ఉఎ సంహరిం చుకొని, తమను గెలిపించిన ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తమకున్న ప్రేమను చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలియజేశారు. ఈ విషయంలో కేంద్ర ఉక్కు శాఖమంత్రి జనతాదళ్ సెక్యులర్ పార్టీ నాయకుడు కుమారస్వామిని చూసి బుద్ధి తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నడుస్తున్న కర్ణాటక రాష్ట్రంలోని భద్రావతి నగరంలో లాభాల బాటలో ఉన్న సెయిల్ ఆధ్వర్యంలో



నడుస్తున్న విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ ప్లాంట్ నష్టాలలో ఉందని రూ.16 వేల కోట్లను ఉద్దీపన ప్యాకేజీగా సాధించుకోవడం జరిగిందన్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఉన్నా కూడా కేవలం రూ.11440 కోట్లను కేటాయించడం జరిగిందని తెలియజేశారు. ఇదే బిజెపి ప్రభుత్వం గతంలో రైతులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను, పంజాబ్ మరియు హర్యానా మిగతా రాష్ట్రాల రైతులు వ్యతిరేకిస్తే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఆ చట్టాలను రద్దు చేసిందని తెలియజేస్తూ ఆ రాష్ట్రాల నాయకులను ప్రేరణగా తీసుకొని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్రంతో పోరాడి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేసే విధంగా పోరాటం చేయాలన్నారు. అప్పుడే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు న్యాయం జరుగుతుందని తెలియ జేశారు. కూటమి నాయకులకు విశాఖ స్టీల్ ప్లాంట్ మీద శ్రద్ధ లేదని అందుకే ఈ నెలలో 8వ తారీఖున విశాఖలో పర్యటించిన ప్రధానమంత్రి శ్రీనరేంద్ర మోడీ గారిని కనీసం స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటు పరం చేయవద్దని అడిగే సాహసం కూడా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, దగ్గుబాటి పురందేశ్వరిలు చేయలేకపో యారని ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జరిగిన అవమానం గా భావించాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేష న్‌కు సంబంధించి సమస్యకు సంబంధించిన మూలా లు సరిదిద్దకుండా తప్పుడు నిర్ణయాలు తీసు కుంటున్నారని తెలియజేశారు. ఈ ప్యాకేజీ వలన కార్మికులు అధికారులు యాజమాన్యం, ప్రజల మధ్య చాలా అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయవలసిన బాధ్యత, ఈ ఎన్డీఏ కూటమి నాయకులపైన ఉందని తెలియజేశారు.

# విశ్వకవి యోగి వేమన జయంతోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్





విశాఖపట్నం, ఆగస్టు 11, మేజర్‌న్యూస్

విశ్వకవి యోగివేమన జయంతోత్సవాలు శ్రీ వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు , సౌత్ శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు ఆర్కే బీచ్ వద్దగల యోగివేమన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో వేమన చిరస్మరణీయుడు అన్నారు. వేమన పద్యాలు లోకనీతులని, సామాజిక చైతన్యం కల్పించుటకు,అనేక సామాజిక అంశాలు పద్యాలలో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి గారు, పెద్దలు ప్రసాద్ రెడ్డి గారు, వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మధు కుమార్ గారు ,అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి గారు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి గారు, కోశాధికారి సంజీవరెడ్డి గారు, పెద్దలుసూర్య ప్రకాష్ గారు, పోతన్ రెడ్డి గారు స్థానిక నేతలు ఆత్మలో పాల్గొన్నారు,.

## సోమవారం జివిఎంసిలో
# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం
### నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి.
### జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్





విశాఖపట్నం, ఆగస్టు 11, మేజర్‌న్యూస్

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాలలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( %ూబఎశ్రీఅఎ +తీఅవఱఖఅఎవ =వంతీవంయిశ్రీ ంఎర్‌వఎ-ూ+=ూ% )కార్యక్రమం" 2025 జనవరి 20 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.కావున,నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై నగర ప్రజలు జనవరి 20 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు వారు తెలియచేశారు.

# హెవీ వెహికల్, ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు



విశాఖపట్నం, ఆగస్టు 11, మేజర్‌న్యూస్

రోడ్డు సేఫ్టీ వరో ఉత్సవాలులో భాగంగా హెవీ వెహికల్స్ డ్రైవర్, ఆటో డ్రైవర్స్ కు వైద్య పరీక్షలు నిర్వహించారు. మద్దిలపాలెం ట్రాఫిక్ పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ వద్ద విశాఖపట్నం సిటీ నగర్ పోలీస్ కమిషనర్ గారు ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏ డి సి పి కె ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఏసిపి ఎస్ వాసుదేవ రావు ఆధ్వర్యంలో ద్వారక ట్రాఫిక్ సర్కిల్ సిఐ కె ఎస్ ఎన్ వి ప్రసాద్, SHO MVP PS V% కనకారావు గార్లు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితిని బీపీ , కళ్ళు, రక్త పరీక్షలు చేశారు.

# అమిత్‌షాకు స్వాగతం పలికి లోకేష్, హోంమంత్రి అనిత



గన్నవరం ఆగస్టు 11, మేజర్‌న్యూస్

రెండు రోజుల విజయవాడ పర్యటన కోసం గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షాకి మంత్రి నారా లోకేశ్ తో కలిసి ఆహ్వానం పలికిన ఏపీ హోం మంత్రి అనిత కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఐఎం ప్రాంగణాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా అమిత్ షాకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికిన హోం మంత్రి.

# అంబేద్కర్‌ని అవమానించిన అమిత్ షా ' గో బ్యాక్ '
### ప్రజా వామపక్ష కార్మిక సంఘాల నాయకుల డిమాండ్




విశాఖపట్నం, ఆగస్టు 11, మేజర్‌న్యూస్

భారత రాజ్యాంగ రూపకర్త బి. ఆర్. అంబేద్కర్ ని రాజ్యసభలో అనుచిత వాక్యలు చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ ప్రజా, వామపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటన సందర్భంగా గొ బ్యాక్ అమిత్ షా అని నినాదాలు చేస్తూ, అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, అమిత్ షా ని పార్లమెంట్ నుండి బర్తరఫ్ చేయాలని వారంతా డిమాండ్ చేస్తూ జీవీఎంసీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్ షా కి రాజ్యాంగం మీద, అంబెద్కర్ మీద గౌరవం ఉంటే అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయరన్నారు. ప్రభుత్వాలు ఓట్లు కోసం, అధికారం కోసం మాత్రమే అంబేద్కర్ విగ్రహాలను పార్లమెంట్లో పెడుతున్నారని తెలిపారు.రాజకీయ నాయకులు రాజ్యాంగాన్ని అవమానించడానికి వెనుకాడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమిత్ షా అంబేద్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి దళితులకు ఉన్న రిజర్వేషన్లు రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. అలాగే ప్రభుత్వ సంస్థలను అదానికి, అంబానీకి కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ప్రధాని మోడీకి అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను శిక్షించవలసిన అవసరం లేదా అని నిలదీశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యులు కె.ఎం.శ్రీనివాసరావు ,మాజీ ఎమ్మెల్సీ.ఎం.వి.ఎస్. శర్మ, రైతు సంఘము జిల్లా అధ్యక్షుడు జి. నాయన బాబు, మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ , ఇప్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జి.ఎస్.జె.అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్యాకేజీ ఉపశమనం మాత్రమే, ప్రైవేటీకరణ కాదని
# కేంద్రం ప్రకటన చేయాలి...
### మహా ధర్నాలో సిపిఎం రాష్ట్ర నాయకులు కే లోకనాథం



విశాఖపట్నం, ఆగస్టు 11, మేజర్‌న్యూస్

భిజెపి ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ ఉపశమనం మాత్రమేనని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని కేంద్రం స్పష్టం చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు కే లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంటుకు సొంతగనులు కేటాయించాలని , సెయిల్ లో విలీనం చేయాలని, స్టీల్ ప్లాంట్ ను అమ్మే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం శిబిరం వద్ద ఆదివారం మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రివైవల్ కు కేంద్ర ప్రభుత్వం 11440 కోట్ల రూపాయలు ప్యాకేజీ ప్రకటించిందని, ప్యాకేజీ కేవలం ఉపశమనం మాత్రమేనని స్టీల్ ప్లాంట్ కు ఒరిగేది ఏమీ లేదని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ను అమ్మే నిర్ణయం రద్దు చేసి, సొంత గనులు కేటాయించి, సెయిల్ లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్యాకేజీతోనే ప్లాంటు సమస్య తీరిపోయినట్లుగా టిడిపి, జనసేన ,బిజెపి కూటమి నేతలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంబరాలు ఆపి,కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఉత్పత్తి ప్రారంభం కాని అనకాపల్లి జిల్లా ఆర్ఎస్ మిట్టల్ స్టీల్ ప్లాంట్కు గనులు కేటాయించాలని, దానికి కావలసిన అనుమతులన్ని త్వరితగతిన ఇవ్వాలని చంద్రబాబు, ప్రధానితో ఢిల్లీలోనూ, విశాఖలో మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటికరణ నిలిపివేస్తున్నట్టు కేంద్రంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ ప్రకటన చేస్తేనే ప్రైవేటికరణ ఆగుతుందన్నారు. అలాగే కార్మికుల తొలగింపులు ఆపి, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.విఎస్. శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని డబల్ ఇంజన్ సర్కార్ కేంద్రం ప్రకటించిన స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ సంతృప్తికి పరిమితం కాకుండా స్టీల్ ప్లాంట్ రక్షణ, శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యులు కె.ఎం.శ్రీనివాసరావు, కార్పొరేటర్ బి గంగారావు, రైతు సంఘము జిల్లా అధ్యక్షుడు జి. నాయన బాబు, జె.అయోధ్యారామ్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు
### ఘనంగా శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమంలు
### పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



గరుగుబిల్లి, జనవరి 19, మేజర్ న్యూస్:

మండల కేంద్రంలోని శ్రీషిరిడి సాయి బాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమ%శీ%లు కార్యక్రమమును ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి, తదితరపూజ కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా శ్రీషిరిడి సాయిబాబాకు విశేష అర్చనలు అభిషేకములు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగకర్త, అసంఖ్యాక దేవాలయాల ప్రతిష్టాపకులు ఎస్ వి ఎల్ ఎన్ శర్మయాజి సంపూర్ణ సహాయ సహకారా లతో శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమ%శీ%లు కార్యక్రమంను నిర్వహించారు. అదే విధ%శీ%గా ఈహెూమములు చేయించు కోవడంవల్ల ఈతి బాధలు తొల గడంతో పాటు మనసు లో కోరిన కోర్కెలు నెరవేరు తాయని తెలిపారు. ఈహెూమంలు కార్యక్రమంలో పాల్గొన్న దంపతులకు దీక్షవస్త్రములు ను కమిటీ సభ్యులు అందజే శారు. పూజా కార్యక్రమాల్లో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఈమేరకు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాద%శీ%ను అంద జేయడం జరిగిందని తెలిపా రు.

# నేటి నుంచి ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలు
### మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్
### మరుపెంట,రావివలస గ్రామాల్లో ప్రారంభం... డాక్టర్ సురేష్ కుమార్
### పశువైద్య శిబిరాల్లో తనిఖీలు అనంతరం ఉచితంగా మందులు అందజేత

గరుగుబిల్లి, జనవరి19, మేజర్ న్యూస్:




మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించ నున్నామని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. మండల పరిధి లోని ఉల్లిభద్ర గ్రామంలోని పశు వైద్య కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రారంభం రోజు అయిన సోమవారం మరుపెంట, రావివలస, గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పశు వైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీ య యాజమాన్యంపై అవగాహన సదస్సులను నిర్వహించడం జరుగు తుందని డాక్టర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. పశు వైద్య శిబిరంలో పశువులకు తనిఖీలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులను అందజే యడం జరుగుతుందని చెప్పారు. ఈమేరకు ఆయా గ్రామాల లో నిర్వ హించనున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

# వాహన చోదకులకు హెల్మెట్‌తో పాటు పత్రాలు తప్పనిసరి
### ఇన్స్పెక్టర్ వరప్రసాద్



పార్వతీపురం రూరల్ జనవరి 19 (మేజర్ న్యూస్):

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ తో పాటు వాహనాలు యొక్క పత్రాలను ప్రయాణ వేళలో ఉంచాలని లేనియెడల ప్రమాదాలు జరిగితే శిక్ష అర్హులు అవుతారని స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ అన్నారు. భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక వెంకంపేట గ్రామ శివారు వై జంక్షన్ లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం మిన్న ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాల్సిన విషయమని , ప్రయాణ వేళలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ప్రతి మోటార్ వెహికల్ పై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, అలాగే ఆటోల్లో కూడా పరిమితికి మించి ప్రయాణించడం చట్టరీత్య నేరమవుతుందని, ప్రధానంగా ప్రమాదాలు జరిగితే అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి లేక ఆయా ఇన్సూరెన్స్ సంస్థల నుంచి పరిహారం అందడం జరగదని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రత పాటించాలని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి బిజీ లైఫ్ లో నిబంధనలను పాటించడం లేదని ఇది ప్రయాణ వేళలో గుర్తు రానిప్పటికీ ప్రమాదాలు జరిగితే మాత్రం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఈనెల 27న కురుపాంలో మెగా జాబ్ మేళా
### గోడపత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగదీశ్వరి.

గుమ్మలక్ష్మీపురం. జనవరి 19, (మేజర్ న్యూస్).



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ మరియు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వారి సహకారంతో కురుపాం మండల కేంద్రంలో ఈనెల 27న సంకల్ప మెగా జాబ్ మేళ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో నిర్వ హిస్తున్నారు. ఈ జాబ్ మేళా ను కురుపాం శాసన సభ సభ్యురాలు తోయక జగదీశ్వరీ ప్రారంభిస్తారు. ఈ జాబ్ మేళాలో 20 ప్రముఖ బహుళజాతియ కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించనున్నారు. కావున కురుపాం నియోజకవర్గ నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరీ జాబ్ మేళా పత్రికను ఆవిష్కరించారు. మరిన్ని వివరాల కొరకు 6303493720, 8978878557 ఈ సెల్ నెంబర్లకు సంప్రదించగలరు.

# వేమన పద్యాల ద్వారా ప్రపంచానికి ఆధ్యాత్మిక జ్ఞానం..



విజయనగరం టౌన్ , జనవరి 19 , మేజర్ న్యూస్ :

ఆధ్యాత్మిక కవి శ్రీ వేమన భగవాన్ తన పద్యాలు ద్వారా యావత్తు ప్రపంచానికి ఆధ్యాత్మిక జ్ఞానం తెలియజేసారని విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అతిథి విజయగజపతిరాజు అన్నారు. ప్రబోధసేవా సమితి,ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు అధ్వర్యంలో ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో వేమన జయంతి వేడుకలు ఆదివారం విజయనగరం టీటీడీ భవనంలో ఘనంగా జరిగాయి.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. అనంతరం వేమన ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేమన సాధారణ వ్యక్తి కాదని సాక్షాత్తు భగవాన్ స్వరూపమని అన్నారు. ఆయన పద్యాల ద్వారా ఎంతో ఆధ్యాత్మికత జ్ఞానాన్ని ప్రజలకు తెలియజేశారు.. జీవాత్మ ఆత్మ పరమాత్మ విధానాన్ని ఆయన తన రచనల ద్వారా తెలియజేశారు... అనంతరం సమితి ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం వేమన ప్రతిమను విజయనగరం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ రాజు. తూర్పు కాపు సంక్షేమ సంఘం చైర్ పర్సన్ పాలవలస యశస్విని, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసల నాయుడు, రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, బాలల న్యాయమండలి సభ్యులు కరణం జనార్ధనరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం, జాతీయ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు బాల బ్రహ్మారెడ్డి, రాష్ట్ర జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉత్తరాంధ్ర ప్రబోధా సేవాసమితి ప్రతినిదులు పాల్గొన్నారు.

## పార్వతీపురం ఐటిడిఏ లో ఖాళీగా ఉన్న
# పోస్టులను భర్తీ చేయాలి
### గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్.

గుమ్మ లక్ష్మీపురం, జనవరి 19, (మేజర్ న్యూస్).

పార్వతిపురం ఐటిడిఏ కార్యాలయం గిరిజన ఉప సంచాలకులు (డిడి) విభాగంలో ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ పోస్టు ను, అలాగే గిరిజన గురుకులం సూపరింటెండెంట్ (ఓఎస్డీ) పోస్టులను సంబంధిత శాఖ అధికారులు తక్షణమే భర్తీ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లా సురేష్ డిమాండ్ చేశారు.ఆయా విభాగంలో గతంలో పనిచేసిన ఉద్యోగి పదవి విరమణ అయిన తరువాత సంవత్సరాల గడిచిన ఇంతవరకు ఎవరిని నియమించలేదని,అలాగే గురుకుల పాఠశాలలకు సంబంధించిన అధికారిని పూర్తి స్థాయిలో నింపాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఆయా విభాగాలలో అధికారులు లేకపోవడంతో పనులు నతనడకన సాగుతున్నాయని అన్నారు. ఈమేరకు గిరిజన సంక్షేమ అధికారులు స్పందించి కాళీ కోసం భర్తీ చేయాలని కోరారు.

# మొన్న బొలెరో.. నిన్న ఆటో... నేడు రైలు...!

### ఒరిస్సా తరలిపోతున్న పీడీఎస్ బియ్యం...?

### ఒకవైపు అధికారుల దాడులు... మరోవైపు వ్యాపారస్తుల తరలింపు?

### అడ్డుకట్ట వేస్తారు... చేతులెత్తేస్తారు...?



<u>పార్వతీపురం రూరల్ జనవరి 19 (మేజర్ న్యూస్):</u>

పట్టణాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని పిడిఎస్ బియ్యాన్ని ఇదేచ్ఛగా ఎగువ రాష్ట్రమైన ఒరిస్సాకు తరలించుకొని పోతున్నారు. ఈ వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులు ఎంతగా బరితెగిస్తున్నారంటే మొన్న అధికారులు దాడుల్లో చౌకదారి ధరల డిపోల్లో గల బియ్యంతో బొలెరో వాహనం పట్టుపడితే...! నిన్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నేడేమో ఏకంగా రైలు మార్గం ద్వారా రాయగడ తరలిస్తుండగా సమాచారం అందుకున్న అధికారులు టౌన్ స్టేషన్లో పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎంతో కష్టపడి సమాచారం అందుకొని వలపని అధికారులు తరలిస్తున్న బియ్యాన్ని అయితే పట్టుకుంటున్నారు తప్ప ...ఈ వ్యవహారాన్ని తెర వెనక ఉండి నడిపిస్తున్న వ్యక్తులపై మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలో అనేకమంది వ్యాపారస్తులు దీనికి సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరంతా చేప కింద నీరులా ఉండి వీరి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారు. పట్టణంలో అద్దెల్లో తీసుకొని అక్కడ నివసిస్తున్నట్లు కేవలం నటిస్తూ ఈ పిడిఎఫ్ బియ్యాన్ని ఇదేచ్ఛగా కొనుగోలు చేస్తున్నారు. సమయం చూసుకొని ప్రత్యేక వాహనాలతో అధికారుల యొక్క కంటపడకుండా ఒరిస్సాకు తరలిస్తున్నారు ముఖ్యంగా అలమండ ప్రాంతానికి చెందిన అనేక మంది వ్యాపారులు పట్టడంలోని బెలగాంలో నివసిస్తున్నారు. వీరు కేవలం వారి యొక్క వ్యక్తిగత వ్యాపార నిమిత్తమే ఇక్కడికి వలస వచ్చి బతుకుతున్నట్లు పట్టణ వాసులతో పాటు అధికారులకు ముఖ్యంగా పోలీసు వర్గాలకు భ్రమ కల్పిస్తున్నారు. ఇలా ఒరిస్సా రాష్ట్రమైన అలమండ, కత్తులపేట , బందుగాం ప్రాంతాల నుంచి వలస వచ్చి వ్యాపారం చేస్తున్న వారి యొక్క వృత్తాంతం చూస్తే వీరుపై గతంలో ఒరిస్సా రాష్ట్ర పోలీసుల ఖాతాలో అనేక సారా తయారీ కేసులు, అక్రమ వ్యాపారాలు వంటి కేసులు కోకోలలనే చెప్పాలి. దీనికి తోడు గతంలో మావోయిస్టుల హెచ్చరికలు వీరిపై ఉండడంతో బతుకుతెరువు కోసం పట్టణానికి వలస వచ్చారు అయితే చెంతసచ్చిన పులుపు చావదన్న చందంగా వీరు బతుకుకోసమైతే ఇక్కడికి వచ్చారు తప్ప వారి బుద్ధి మాత్రం ఏమాత్రం మార్చుకోలేదు. నేటికీ వక్రబుద్ధి ప్రదర్శిస్తూ తప్పుడు మార్గంలో అక్రమ వ్యాపారాలకు శ్రీకారం చేస్తున్నారు. ఏదో ఒక విధంగా అక్రమ వ్యాపారం చేస్తూ డబ్బు సంపాదించాల న్న దృఢ సంకల్పం తప్ప భవిష్యత్తులో జరిగే పరిణామాలపై మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు వీరు. ఇటీవల విజిలెన్స్ అధికారులు బొలెరో వాహనంతో అలమండకు తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే ఈ కథను ఒక్కసారిగా లోతుగా పరిశీలిస్తే దీని వెనక ఉన్న వ్యాపారిది స్వగ్రామం అలమండ. అక్కడ ఈయన చేయని వ్యాపారం అంటూ ఏదీ లేదంటే అతిశయోక్తి కాదు. అంతటితో ఆగకుండా ప్రభుత్వం తెలుపు కార్డుదారులకు పంపిణీ చేస్తున్న కోటా బియ్యాన్ని కూడా స్థానికంగా కొనుగోలు చేసి అక్రమంగా ఒరిస్సాకు తన సొంత వాహనంతో తరలించకపోతున్నాడు ఇదిలా ఉంటే ఇటీవల ఆటోతో అదే విజిలెన్స్ అధికారులు బట్టి వలస గ్రామం వద్ద దాడి చేసే పట్టుకున్న దాని వెనక ఉన్నది కూడా అదే అలమండ ప్రాంతానికి చెందిన నాటు సారా తయారీ వ్యాపారిని తెలుస్తుంది. ఈ వ్యాపారి పరిసరాంపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి పత్రాలు లేని ఆటోలో తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు ఇప్పుడేమో ఏకంగా రైలు బండితో రాయగడ తరలిస్తున్నారంటే మీరు ఎంతగా బరితెగించి డబ్బు సంపాదనగా ముందుకు సాగిస్తున్నారు అర్థమవుతుంది. ఇటువంటి వ్యాపార చేస్తున్న వారి యొక్క సామ్రాజ్యాలకు ఎదురుగా వెళ్లి అడ్డుకునే నాధుడు కరువవుతున్నాడు. అవసరమైతే దాడులు చేసే సమయంలో అధికారుల ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా వీరు ముందుకు అడుగులు వేసే పరిస్థితి కూడా ఉందనే చెప్పాలి ఈ విషయం తోనే అధికారులు చూసి చూడనట్లుగా ఈ కోటా బియ్యం అక్రమ రవాణా వ్యవహారాన్ని వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### తనువు చాలిస్తున్నాను..

# నన్ను క్షమించండి..

## వైద్య విద్యార్థి ఆత్మహత్య

<u>నెల్లిమర్ల, జనవరి19, మేజర్ న్యూస్:</u>

అమ్మా, నాన్నా, తమ్ముడూ... నన్ను క్షమించండి. మిమ్మల్ని వదిలి వెళ్లి పోతున్నాను. చదువుపై ఏకాగ్రత పెట్టలేక తనువు చాలిస్తున్నాను. నా వల్లే మీ ఆరోగ్యం బాగుండడం లేదు. నాకు నేనే పిచ్చోడిలా అనిపిస్తున్నాను. అమ్మా, నాన్నా నాకు మీరు ఎంతో చేశారు. మిమ్మల్ని బాధ పెట్టి వెళ్లిపోతున్నాను. సారీరా తమ్ముడు నీకు అన్నలాగా కూడా ఉండలేక పోయాను. ఇదీ నెల్లిమర్ల మిమ్స్ వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకునే ముందు రాసిన సూసైడ్ నోట్..



నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన అతుకూరి సాయి మణిదీప్(24) మిమ్స్ లో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం నుంచి బ్యాక్ లాగ్స్ ఎక్కువగా ఉండటం, చదుపై ఏకాగ్రత ఉండడం లేదని సూసైడ్ నోట్ రాసి కళాశాల ప్రాంగణంలో ఉన్న హాస్టల్ గదిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆన్లైన్లో పురుగుల మందు తెప్పించుకుని, కూల్ డ్రింకులో కలుపుకుని తాగాడు. విషయం తెలుసుకున్న సహ విద్యార్థులు మిమ్స్ యాజమాన్యానికి తెలియజేశారు. యాజమాన్య ప్రతినిధులు నెల్లిమర్ల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి గణేష్ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయి మణిదీప్ బెడ్ కింద పోలీసులకు సూసైడ్ నోట్ లభించింది. చదువు విషయంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సదరు నోట్ లో మృతుడు ప్రస్తావించాడు. బ్యాక్ లాగ్స్ ఎక్కువగా ఉండటం, చదువుపై ఏకాగ్రత లేకపోవడంతో చనిపోతున్నట్లు రాశాడు. సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

## అంగన్వాడి సహాయకుల నియామకానికి

# నోటిఫికేషన్ విడుదల

<u>పార్వతీపురం, జనవరి 19, మేజర్ న్యూస్ :</u>



జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడి సహాయకుల పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా. టి కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పాలకొండ డివిజన్ లో సీతంపేట ప్రాజెక్టు పరిధిలో రెండు, భామిని ప్రాజెక్టు పరిధిలో ఒక పోస్టు, కురుపాం ప్రాజెక్టు పరిధిలో ఆరు., పార్వతిపురం డివిజన్ లో పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో ఒకటి, సాలూరు ప్రాజెక్టు పరిధిలో ఒకటి అంగన్వాడి సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని ఆమె చెప్పారు. పార్వతీపురం, సాలూరు, కురుపాం, సీతంపేట, భామిని ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులలో ఏర్పడిన 11 అంగన్వాడి సహాయకుల పోస్టుల ఖాళీలను షెడ్యూల్ ట్రైబల్ హేబిటేషన్ గ్రామాలను అనుసరించి షెడ్యూల్ ట్రైబల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు ఒక యూనిట్ గా పరిగణించి కేటగిరిని నిర్ధారించి ప్రకటించడం జరిగిందన్నారు. స్థానిక స్థిర నివాసం కలిగిన అర్హులైన వివాహిత మహిళా అభ్యరద్దుల నుండి దరఖాస్తులు కోరడం జరిగిందని అన్నారు. ధరఖాస్తులను జనవరి 27వ తేది సాయంత్రం 5 గంటలలోపు సంబందిత ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలము తదుపరి తెలియజేయడం జరుగుతుందని ఆమె అన్నారు. భర్తీ నియమ నిబంధనల ప్రకారం వచ్చిన ధరఖాస్తుల్దారులను మాత్రమే ఇంటర్వ్యూ నకు పిలవడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ పోస్టుల భర్తీ చేయుటకు గానీ, నిలుపుటకు గానీ, రద్దు పరుచుటకు గాని నియామకపు కమిటీ చైర్మన్ కు పూర్తి అధికారం ఉందని ఆమె అన్నారు.

# వేమన గొప్ప మానవతావాది



<u>పార్వతీపురం, జనవరి 19, మేజర్ న్యూస్ :</u>

యోగి వేమన గొప్ప మానవతావాది అని జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత అన్నారు. యోగి వేమన జయంతి కార్యక్రమం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘసంస్కరణను ప్రబోధించి సర్వమానవ సమానత్వం,అశ్పృస్యత ఖండన, నైతికప్రభోధం, మూఢనమ్మకాల ఖండన వంటి అంశాలను తన పద్యాలలో వెల్లడించారని తద్వారా గొప్ప మానవతావాదిగా పరిగణించడం జరిగిందన్నారు. కవిగా, యోగిగా ప్రజాదరణ పొందారని ఆమె చెప్పారు. సరళమైన భాష, మధురమైన సందేశం కారణంగా ప్రజలు వేమన పద్యాలను ఆదరించారని పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ వంటి వారు వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించారని, తద్వారా వాటి ప్రాశస్త్యాన్ని గుర్తించవచ్చని అన్నారు. వేమన కవిత్వ శైలి వేమన పద్యాల్లోని అనేక పంక్తులు ఇప్పుడు తెలుగు భాష వ్యావహారిక పదబంధాలుగా విరాజిల్లుతున్నాయని ఆమె అన్నారు. వేమన కవితలు సామాజిక, నైతిక, వ్యంగ్య, ఆధ్యాత్మిక స్వభావం కలిగి ఉంటాయని అన్నారు. ఒక్క వేమన పద్యం కూడా వినని తెలుగువారు ఉండరని ఆమె అన్నారు. సమాజంలోని రుగ్మతలను తూర్పార బట్టిన మనో వైజ్ఞానికుడు వేమన అని ఆమె పేర్కొన్నారు. సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన సంఘసంస్కర్త, విప్లవకారుడు అన్నారు. పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ వారి సహకారంతో వేమన జీవిత చరిత్రను 14 భాషలలోకి అనువదించడానికి కారకులయ్యారని, ఆంగ్ల, ఐరోపా భాషల్లోకీబీ అన్ని ద్రవిడ భాషల్లోకీ వేమన పద్యాలు అనువాదమయ్యాయని అన్నారు. సి.ఇ. గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమన సాహిత్యానికి ముగ్ధులై ఆయనను లోక కవి?

# 20 నుండి పశు ఆరోగ్య శిబిరాలు




<u>పార్వతీపురం, జనవరి 19, మేజర్ న్యూస్ :</u>

జిల్లాలో పశు ఆరోగ్య శిబిరాలను ఈ నెల 20వ తేదీ నుండి 31వ తేది వరకు నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్ ను విడుదల చేసారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రాష్ట్రంలోని పశు పోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నిధులు కేటాయిస్తూ వారి ఆర్ధికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందని ఆయన చెప్పారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశు పోషణ ఖర్చులు తగ్గించడానికి, రైతుకు ఆర్థిక అండను కలగచేయడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. పశుసంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెటర్నరీ డిస్పెన్సరీ, వెటర్నరీ ఆసుపత్రి పరిధిలో అన్ని మండలాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. శిబిరాలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కోరారు.జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు మాట్లాడుతూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో పశువైద్యులు పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహిఇస్తామని చెప్పారు. ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఎదలో ఉన్న పశువులను గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయడం, చూడి పరీక్షలు నిర్వహించి శాస్త్రీయ సూచనలు ఇవ్వడం జరుగుతోందని ఆయన అన్నారు.

## భీమిలి వైసీపీ ఇన్చార్జిగా చిన్నశ్రీను నియామకం పట్ల ఎంపీపీ హర్షం

<u>గరుగుబిల్లి, జనవరి 19, మేజర్ న్యూస్:</u>



ఉమ్మడి జిల్లాల జిల్లా పరి షత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను)ను భీమిలి నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమ న్వయ కర్తగా నియమించడం పట్ల మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ,మండల పరి షత్ అధ్యక్షులు ఉరిటి రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావుతో పాటు, మరుపెంట గ్రామపంచాయతీ సర్పంచ్ ఉరిటి నిర్మలలు, భీమిలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్తగా బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో అభినందనలు తెలియ జేశారు. ఈసందర్భంగా ఎంపీపీ రామారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మరియు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్ రెడ్డి భీమిలి నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించారని పేర్కొన్నారు. భీమిలి నియోజకవర్గం సమన్వయకర్తగా చిన్న శ్రీనును నియమించడం పట్ల రావుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), నాగూరు సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి కూర్మినాయుడు, కేతిరెడ్డి అచ్యుత రావు, పెద్దూరు గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, బి వి పురం సర్పంచ్ బొత్స లక్ష్మి, బాణాల సురేష్, దలాయివలస సర్పంచ్ గులిపల్లి నారాయణమ్మ, గులిపల్లి శ్రీనువాసునాయుడు, బాణాల సురేష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## సీతారాంపురంలో కొనసాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు

<u>గరుగుబిల్లి, జనవరి 19, మేజర్ న్యూస్:</u>



మండలంలోని కొంకడివరం గ్రామపంచాయతీ పరిధిలోని సీతా రాంపురం గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, భజన కార్య క్రమాలు కొనసాగుతున్నాయి. ఈమేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ,హిందూ ధర్మ ప్రచార పరిషత్తు విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లా కన్వీనర్ జె శ్యాంసుందర%శీ% ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలతో పాటు భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాలతో పాటు భజన కార్యక్రమాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. తిరుమల తిరుపతి దేవ స్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గ్రామా ల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల ను నిర్వహిస్తున్నారు. శ్రీసీతారామ భజన సేవా మండలి సభ్యులు గులి పల్లి చినతిరుపతిరావు, గులిపల్లి సూర్యకుమారి, బడే సుధారాణి, తదితరులు భజన గీతాలను ఆల పించారు. ఈకార్యక్రమంలో శ్రీసీతా రామ భజన మండలి సభ్యులు బడే త్రినాధరావు, బలగ లక్ష్మి, సూర్యనా రాయణ, పకీరునాయుడు, తదిత రులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో "చదవడం మాకిష్టం"

### గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూధనరావు

### విద్యార్థులకు పలురకాల ఆటలు పోటీలు




<u>గరుగుబిల్లి ,జనవరి 19, మేజర్ న్యూస్:</u>

మండల కేంద్రంలోని శాఖా గ్రంధాల యంలో జిల్లా గ్రంథాల యసంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మి ఆదేశాలు మేరకు ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను విద్యార్థులకు చదివి వినిపించారు. పద్యం లు, గద్యంలు, మరియు చదరంగం, క్యారంబోర్డు, కబడ్డీ పోటీలను విద్యార్థులకు నిర్వహిం చారు. ఈసందర్భంగా శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లా డుతూ గ్రంధాలయాల్లో విద్యా ర్థులకు ఎంతో ఉపయోగపడే పలురకాల పుస్తకాలను సిద్ధం చేశామని వీటిని చదువు కోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగ పడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయ న్నారు. గ్రంథాలయ%శీ%లో జిల్లా గ్రంధా లయ సంస్థ కార్యదర్శి ఆదే శాలు మేరకు నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం కార్యక్రమ%శీ%ను విజయ వంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించేలా పలు కార్యక్ర మాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రంథాలయ నిర్వాహకులు మధు సూదనరావు తెలిపారు. ఈకార్య క్రమంలో పాఠకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

### కుష్ఠు వ్యాధి ఇంటింటి సర్వేని

# విజయవంతం చేయండి

### వైద్యధికారి గోపాలకృష్ణ



<u>కొత్తవలస జనవరి 19 మేజర్ న్యూస్.</u>

కుష్ఠు వ్యాధి ఇంటింటి సర్వే చేసి అనుమానిత కేసులను గుర్తించండి అని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి : వైద్యధికారి డా " గోపాలకృష్ణ అన్నారు ఈ మేరకు ఆయన మంగళవారం పీహెచ్ సి వియ్యంపేట లో సిబ్బంది కి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు . ఆయన మాట్లాడుతూఈ కార్యక్రమం లో ఈ నెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి గ్రాస్తులను గుర్తించే కార్యక్రమం లేప్రోసి కేసు డిటెక్షన్ కాంపెయిన్ లో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి ఏ. ఎన్. ఎమ్, ఆశ వర్కర్స్ కుష్ఠు వ్యాధిగ్రాస్తులను గుర్తించి, కుష్ఠు వ్యాధి నిర్మూలన అందరూ కృషి చేయాలనీ తెలిపారు. శరీరం పై రాగి రంగులో గాని గోధుమ రంగులో గాని స్పర్శ లేని మచ్చలు ఉంటే పీహెచ్ సి వైద్యునికి రెఫెర్ చేయాలనీ తెలిపారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనికి బహుళ ఔషద చికిత్స (%వీణు% )మందులు అన్నీ ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉచితంగా దొరుకుతాయని తెలిపారు. కుష్ఠు వ్యాధి పట్ల సామజిక రుగ్మా త విడనాడి వారికీ అండగా ఉండి వారిలో ధైర్యం నింపాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో ఈ. ఓ. నరసింహారావు, హెచ్. వి. పద్మావతి, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎమ్. ఎల్. హెచ్. పి. లు, ఏ. ఎన్. ఏమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## మూలపేటలో సీతారాముల వారి తీర్థం



**మునగపాక జనవరి 19 మేజర్ న్యూస్**

మండలంలో మూలపేట గ్రామంలో శ్రీ సీతారాముల వారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు, శ్రీ రాములవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, నిర్వహించారు, మరియు తప్పెటగుళ్ళు, చిడతలు, భజనలు, తాడు పెద్ద సేవతో తీర్థం ఘనంగా నిర్వహించారు, ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు అనకాపల్లి ఆవ కాలువ సంగం చైర్మన్ ఆడారి జెకె నాయుడు, సర్పంచ్ బి శెట్టి గంగ అప్పలనాయుడు, జె. కె. బ్రదర్స్ చేతుల మీదగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలోఆడారి కాశీ రావు,ఆడారి రామకోటి,, మొల్లేటి నూకరాజు,బీసెట్టి మధు, కాంద్రేగుల నాగేశ్వరరావు, కాంద్రేగుల ఈశ్వర అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## సంక్రాంతి ముగింపు సంబరాలు

**మునగపాక జనవరి 19 మేజర్ న్యూస్**



మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో కూటమి కార్యకర్తల ఆధ్వర్యంలో మహిళలకు, మహిళా రైతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు, ఈ పోటీలలో సుమారు వంద మంది మహిళలు పాల్గొన్నారు, అనంతరం పోటీలలో గెలుపొందిన విజాతలకు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమర శెట్టి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, ఎక్స్ ఎంపీపీ ఆడారి మంజు చేతుల మీదగా బహుమతి ప్రధానం చేశారు, ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బివి రమణ, సూరిశెట్టి రాము, ఎస్ లక్ష్మణరావు, జగ్గు, బి సత్తిబాబు, దొడ్డి భాస్కరరావు, మాటూరి గోవిందా, ఎస్ హరీష్, పరిమి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు

## ద్విచక్రవాహనదారులకు . ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన




**సీతానగరం జనవరి 19 మేజర్ న్యూస్.....**

పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారము సీతానగరం మండల కేంద్రంలో హనుమాన్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహన దారులకు . ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనల పైఅవగాహన కార్యక్రమం నిర్వహించి ఆటోలో మితిమీరి ప్రయాణికులను ఎక్కించుకోరాదని డ్రైవర్ కి ఇరువైపులా ప్రయాణికులు కూర్చోవడానికి అనుమతించవద్దు అని, ద్విచక్ర వాహనదారులు ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించి తీరాలని, మైనర్లకు మరియు లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనాన్ని నడపడానికి అనుమతించరాదని, రోడ్డు దాటే సమయంలో ఇరువైపులా వాహనాలు రాకపోకలు గమనించి జాగ్రత్తగా రోడ్డును దాటాలని అదేవిధంగా సైబర్ నేరములు పట్ల జాగ్రత్త వహించాలని అవగాహన కార్యక్రమము నిర్వహించి ఫ్ల కార్డులు బ్యానర్ల ద్వారా చూపిస్తూ అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎల్ శ్రీనివాసరావు హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావు తో పాటు పలువురు సిబ్బంది కూడా పాల్గొనడం జరిగినది.

## కొండగుంపాం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకి వినతి



**నెల్లిమర్ల, జనవరి 19, మేజర్ న్యూస్:**

మండలంలోని కొండగుంపాం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కూటమి నాయకులు పతివాడ గోవిందరావు, మొయిద లక్ష్మణరావు కోరారు. భోగాపురం మండలం ముంజేరులో జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం మాధవిని ఆదివారం వారు ఎమ్మెల్యేని కలిసి గ్రామ సమస్యలను వివరించారు. దుర్గాదేవి గుడి నుంచి కొండవెలగాడ రోడ్డుకి రహదారి మంజూరు చేయాలని అలాగే నారాయణమ్మ పేరంటాల గుడి నుంచి ముత్యాలమ్మ, రాజమ్మ తల్లి గుడిలకు రహదారులు మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో సీసీ రహదారులు, సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలకు క్రీడాస్థలం కేటాయించాలని కోరారు. నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు చదవడానికి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని చెప్పారు. దీనికి ఎమ్మెల్యే మాధవి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో లెంక సుధీర్, లెంక లక్ష్మణరావు పాల్గొన్నారు.

## వాడ్రాపల్లిలో ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం

**మునగపాక జనవరి 19 మేజర్ న్యూస్**



మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో ప్రతి యాట క్రమం తప్పకుండా,తెలుగుదేశం పార్టీ అధికారంలో లేకున్నా, సరే, అనకాపల్లి జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్ల వరాహ నరసింగరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల దేశం పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, క్లస్టర్ ఇంచార్జ్ మొల్లేటి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ క్రమం తప్పకుండా వాడ్రపల్లి గ్రామంలో ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం నిర్వహించి, పేదలకు వస్త్ర దానం, మహిళా రైతులని ముగ్గుల పోటీల నిర్వహించి, ప్రోత్సహించి, అలాగే మహిళలచే కోలాటంలో, సింహాద్రి అప్పన్న తాడు పెద్ద సేవ, భజనలతో వంటి కార్యక్రమంలో నిర్వహించిన పల్ల వరహ నర్సింగ్ రావును అభినందించారు, స్వర్గీయ ఎన్టీఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు, ఈ కార్యక్రమంలో మల్ల శేషు, రాము, మల్ల నాయుడు, శంకరు, తదితరులు పాల్గొన్నారు

## అధికారి పార్టీలో గోశాలలు..

# మంజూరి లొల్లి..!

- పని చేస్తావా! పోతావా! అధికారి పార్టీ హుకుమ్..?
- దీంతో నిభందనలు తో పని లేకుండా అడ్డుగోలు అనుమతులు..!
- అక్రమాలపై సమాచార హక్కు కింద కొందరు దరఖాస్తు..!



**మెరకముడిదాం జనవరి 19 న్యూస్ మేజర్**

అధికార పార్టీ నాయకుల హుకుం తో గోశాలల మంజూరిలో మరలా లొల్లి మొదలైంది. అక్టోబరు 14 న మొదలైన ఈ లొల్లి కొనసాగుతూనే ఉంది. దీంతో అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. మండల పశు సంవర్ధకశాఖ, ఉపాధి హామీ అధికారులు గిలా, గిలా కొట్టుకుంటున్నారు. గోశాలల మంజూరు వ్యవహారంలో ముందు నుయ్యి, వెనుక గొయ్యి లా అదికారులు పరిస్థితి తయారైంది. గోశాలలకు రూల్స్ ను పక్కన పెట్టి అనుమతులు, ఉన్నా, లేకున్నా మంజూరు ఇచ్చి గ్రౌండింగ్ చేసేయాల్సిందేనని ఒక పక్క అధికార పార్టీ నాయకుల అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తునట్లు సమాచారం. అనుమతులు, గినుమతులు జాంతా నహి! పని చేస్తావా! పోతావా! అన్న దోరణతో వ్యవహరిస్తున్న అధికార పార్టీ నాయకులు తీరుతో గత్యంతరం లేని పరిస్థితిలో పశు సంవర్ధకశాఖ అధికారి పూర్తి స్థాయిలో డాక్యుమెంట్లు లేకుండానే, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉపాధి హామీ శాఖ అధికారులు కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. మరో పక్క గోశాలలు మంజూరులో నిభందనలు ఉల్లంఘిస్తే చిక్కుల్లో పడతారని అధికారులకు కొంత మంది హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలియ వచ్చింది. అధిష్ఠానం పేరు చెప్పి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలూ ఉన్నాయి. చివరకు అదికార పార్టీ ఆదేశాలకే అధికారులు తలొగ్గారు.గత్యంతరం లేని పరిస్థితిలో అధికారులు తప్పులు చేసేందుకు సిద్ధ పడినట్లు తెలిసింది. దీంతో గోశాలల మంజూరులో ప్రభుత్వ ఉత్తర్వులు తుంగలో తొక్కిన అధికారులపై సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని పొంది, అడ్డుగోలు ఆనుమతులపై పోరాడేందుకు కొంత మంది సిద్ధమయ్యారు. దీనికీ సంభందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండలానికి మొదట్లో 26 గోశాలలు మంజూరయ్యాయి. అప్పట్లో వీటిని అదికార పార్టీ లో బడా నేతలు పంచేసుకున్నారు. ఆ నేపథ్యం లో" మేజర్ న్యూస్" లో అక్టోబరు 14 న " గోశాలల మంజూరులో గోల్ మాల్ " పేరుతో సమగ్ర వార్తా కథనం ప్రచురితం అయ్యింది. ఆ వార్తకు స్పందించిన మెరకముడిదాం పశు సంవర్ధకశాఖ వైధ్యాదికారిని డాక్టర్ హైమావతి,ఆవార్తలో నిజం లేదని, ఖండించడం జరిగింది. ఇప్పుడు సేమ్ అదే పరిస్థితి రిపీట్ ఆయింది. మరి ఇప్పుడు వస్తున్న ఆరోపణలపై సదరు వైద్యాకారిని ఏవిధంగా స్పందిస్తారో ! వేచి చూడాలి. ఇదిలా ఉండగా అప్పట్లో ఆధికార పార్టీ నాయకులు, కుమ్ములాటతో ఆ సంఖ్యను కాస్తా! 72 కు పెంచారని బోగట్టా! కాగా పాత, కొత్తగా మంజూరు అయిన అన్నింటికీ, అధికార పార్టీ అండతో ప్రభుత్వ ఉత్తర్వులు ను గాలికి వదిలేసి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చేసారని తెలిసింది. ఈ క్రమంలోనే గోశాలల అక్రమాలపై సమాచార హక్కు చట్టం ద్వారా అక్రమాలను వెలికి తీసేందుకు కొంత మంది సమాయత్తం అవుతున్నారు. ఈ పరిణామాలన్నీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో తీవ్ర పరిణామాలు చూపిస్తాయని అధికార పార్టీ నాయకులే చర్చించుకోవడం తో పార్టీ మనుగడకే ప్రమాదమని, నాయకుల్లో ఆందోళన మొదలైందని చెప్పక తప్పదు.

**మెరకముడిదాం పశు వైద్యాధికారి వివరణ:-**

మెరకముడిదాం పశు వైద్యాధికారి డాక్టరు హైమవతి వివరణ కోరగా ఈ విధంగా సమాధానమిచ్చారు. తనకు గోశాలలు మంజూరు కొరకు 71దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో కొన్నింటికి పూర్తి స్థాయిలో డాక్యుమెంట్లు లేవు. అందువలన వాటిని నిలుపుదల చేసేందుకు చూశాను. అయితే నాపై తీవ్ర ఒత్తిడి వచ్చి డాక్యుమెంట్లు ఉన్నా, లేకున్నా, మీకు సంబంధం లేదు. ఉన్నవి ఉన్నట్లు పంపించమని ఆదేశాలు వచ్చాయి. దాంతో నాదగ్గరకు వచ్చిన దరఖాస్తులన్నీ పంపించేసాను. ఆ తరువాత సుమారు 30 వరకూ రిజక్టు అయినట్లు తెలిసిందని డాక్టరు హైమావతి మేజర్ న్యూస్ కు వివరణ ఇచ్చారు.

## నేటి నుండి కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం, ఇంటింటి సర్వే




**పార్వతీపురం, జనవరి 19, మేజర్ న్యూస్ :**

జిల్లా వ్యాప్తంగా జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం, సర్వే ఈ నెల 20వ తేది నుండి ఫిబ్రవరి 2వ తేది వరకు జరుగుతుందని జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డా వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశ కార్యకర్త ఒక వాలంటీర్తో పాటు గా ప్రతీ ఇంటికి వచ్చి తనిఖీ చేసి లక్షణాలు ఉన్నవారికి వైద్యధికారి పరీక్షించి చికిత్స అందిస్తారని అన్నారు. శస్త్ర చికిత్స అవసరము అయిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తారని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు చర్మంపై స్పర్శ లేని మచ్చలు మందమైన మెరిసే జిడ్డుగల చర్మం బత్తాయి తొక్కలా ఉండడం. చెవులపై వీపులపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు మరియు కనురెప్పలు, వెంట్రుకలు రాలిపోవడం. కనురెప్పలు మూత పడకపోవడం. ముక్కుదిబ్బడ, ముక్కులో నుండి రక్తం కారడం. కాళు చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండుట. అరచేతులు అరికాలలో స్పర్శ కోల్పోవడం. చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం .చేతుల నుండి వస్తువులు జారిపోవడం. కాళ్లకు చెప్పులు జారిపోవడం .తెలియకుండానే చేతులు, కాళ్లకు బొబ్బలు రావడం .చేతి వేళ్ళు ,కాలి వేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం. ఇలాంటి లక్షణాలు కలిగి ఉంటాయని డాక్టర్ వినోద్ కుమార్ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా ఎస్ భాస్కర రావు ప్రారంభిస్తారని తెలిపారు.

## మల్ల వారి అభివృద్ధికి విశేష కృషి

### రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర



**మునగపాక జనవరి 19 మేజర్ న్యూస్**

మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పారి పల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం మునగపాక మండలం మళ్ల వారి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, ప్రముఖ వైద్యులు డాక్టర్ మల్ల బెనర్జీ, ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మల్ల వారి అభ్యున్నతికి కృషి చేస్తామని, అలాగే పేద విద్యార్థులకు విద్య వైద్య,ఉద్యోగ,స్వయం ఉపాధి, అవకాశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మల్ల భాస్కరరావు, మాట్లాడుతూ మల్ల వారి నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని దీనిని వినియోగించుకోవాలని అన్నారు, మల వారి ఆత్మీయ కలయక నిర్వాహకులైన అనకాపల్లి జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్ల వరాహ నర సింగరావు, శ్రీ పారిపెల్లమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ మల్ల కనుమ నాయుడు, మునగపాక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మల్ల రామును సన్మానించారు,,, ఈ కార్యక్రమంలో మల్లసూరిబాబు, మల్ల శేషు, మల్ల డీలరు అప్పలనాయుడు, మల్ల నాయుడు ,మల్ల సంజీవరావు,మల్ల కాళేశ్వరరావు,మల్ల మల్లయ్య నాయుడు, మల్లా వెంకటరెడ్డి నాయుడు, నాగులపల్లి టిడిపి కార్యదర్శి మల్ల అప్పలనాయుడు, మల్ల ఆది బాబు, మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో మల వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## నక్క అచ్చయ్య కుటుంబానికి

# సొంత నిధులు 1,50,000 సహాయం

### కార్యకర్తలకు అండగా ఉంటా. టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



**నర్సీపట్నం జనవరి 19 మేజర్ న్యూస్:**

అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ఏపీ పురం పంచాయతీ ఉప్పరగూడెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పాల్గొన్నారు. ఏపీ పురం గ్రామ ప్రజలు యువకులు రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాబుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైసీపీ నుండి నక్క రాంబాబు కుటుంబం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిని విజయ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ యువత బైక్ ర్యాలీ నిర్వహించి విజయ్ కు ఘన స్వాగతం పలికారు. భగీరథ మహర్షి విగ్రహానికి మరియు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న విజయ్ ఆయా సమస్యలను గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడు గారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ, ఉప్పరగూడెం ప్రజల చూపించే అభిమానం అమూల్యమని, ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ అనంతరం ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం ఆనందంగా ఉంటుందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమస్యలు తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని, కార్యకర్తలకు ఎప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందని తెలిపారు. అనారోగ్యంతో మృతిచెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నక్కా అచ్చియ్య కుటుంబానికి విజయ్ తమ వ్యక్తిగత నిధులు ?1,50,000 అందించి, ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు అడిగిన పనులు పూర్తయ్యాయని, భగీరథ మహర్షి గుడి, మరియు ప్రహరీ నిర్మాణం చేపడతామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భగీరథ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి జీవో ఇచ్చారని, ఇది బీసీ ప్రజల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం ఎంత శ్రద్ధ వహిస్తుందనడానికి నిదర్శనమని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ?11,000 కోట్లు నిధులు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్లి నిధులు తీసుకొచ్చే సత్తా గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడు గారికే ఉందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, తాండవ వైస్ చైర్మన్ మేడప రెడ్డి జోగిబాబు, మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసిదేవుడు, పారుపల్లి కొండబాబు, నేతల విజయ్ కుమార్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడయ్య(చిన్న), అప్పిరెడ్డి మాణిక్యం, సగర సాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నూకరాజు, అనకాపల్లి జిల్లా సెక్రటరీ నక్క రమణ, సర్పంచ్ పైల రమేష్ నాయుడు, మాజీ సర్పంచ్ పారుపల్లి రామచంద్ర, ఎంపీటీసీ లోక లోవరాజు, యువ నాయకులు వెలగా వెంకట కృష్ణారావు, పారుపల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఎండియూ ఆపరేటర్‌పై చర్యలేవి ?

- **పౌరసరఫరాల అధికారుల అండదండలతో పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం**
- **డీఎస్ఓ, సర్కిల్ 3 ఎ ఎస్ ఓ కనుసన్నలోనే రేషన్ బియ్యం అమ్మకాలు**
- **ఎండియూ ఆపరేటర్ ను కాపాడుతున్న సర్కిల్ 3 ఏఎస్ఓ**
- **వీడియో చిత్రీకరించి అధికారులకు తెలిపిన చర్యలు శూన్యం....**
- **వాహనం ఒకరి పేరు ఆపరేటర్ మరొక్కరు**



**గాజువాక, జనవరి 19,మేజర్ న్యూస్**

అధికారుల అండదండలతో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న ఎండియూ ఆపరేటర్ పై అధికారులు చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనకాడడం లేదో అర్థం కావడం లేదు.కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ మాఫియా ను అరికట్టాలని ఎన్నిమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం లేదని ఇట్టే అర్థమవుతుంది. రేషన్ బియ్యం పక్కదారి పట్టించేందుకు సాక్షాత్తు విశాఖ జిల్లా పౌరసరఫరాల అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారని ప్రజలు గొంతెత్తి చెబుతున్నారు. గాజువాక సర్కిల్ 3 పౌరసరఫరాల అధికారి అండదండలతో పాత వడ్లపూడి ప్రాంతంలో ఎండియు ఆపరేటర్ (ఏపీ 39 టి ఆర్ 9247) ప్రజలు కి రేషన్ బియ్యం లేదని అయిపోయిందని చెప్పి డబ్బులు మాత్రమే ఇస్తున్నాడు. ఈ దృశ్యాన్ని అంతటినీ వీడియోలో చిత్రీకరించి సదరు అధికారులకి తెలియజేస్తున్నప్పటికీ ఎండియు ఆపరేటర్ పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదని ప్రజలు గుసగుసలాడుతున్నారు. అసలు ఎండియు వాహనం ఒకరి పేరు మీద ఉన్నప్పటికీ బినామీ ఎండియూ ఆపరేటర్ వాహనాన్ని ఉపయోగిస్తూ రేషన్ బియ్యం ప్రజలకు అందజేయడం గమనార్హం . ఎండియూ ఆపరేటర్ రేషన్ బియ్యాన్ని ద్విచక్ర వాహనదారులకు 50 కేజీలు లు బ్యాగులతో రేషన్ బియ్యాన్ని బహిరంగంగానే తరలిస్తున్న దృశ్యాలను ప్రజలు చిత్రీకరించి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఈ విషయం అంతా తెలిసిన జిల్లా పౌరసరఫరాల అధికారులు డి.ఎస్.ఓ, సర్కిల్ 3 ఏఎస్ఓ ఎండిఓ ఆపరేటర్ ఇస్తున్న మామూలుకు చూసి చూడలేనట్టుగా వ్యవసరిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై రేషన్ బియ్యాన్ని తరలించడం చూసిన ప్రజలు ఎండియూ ఆపరేటర్ను ప్రశ్నించగా నాకు నచ్చినట్టు చేస్తాను మీరు ఎవరు అడగడానికి, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని సమాధానం చెప్పడంతో



అధికారుల అండదండలు ఎండియు ఆపరేటర్కు ఎంత పుష్కలంగా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. ప్రతి నెల ఇదేవిధంగా జరగడంతో ప్రజలు పౌరసరఫరాల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు ఇస్తున్నప్పటికీ అధికారులు వచ్చి చూసి చూడలేనట్టుగా వెళ్లిపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న అధికారులు, ఎండియూ ఆపరేటర్ పై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

## గిరిజనులకు స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ అసరా..

### రగ్గులు,చీరలతో పాటు వస్తువులు పంపిణీ





**డుంబ్రిగుడ, జనవరి 19, మేజర్ న్యూస్:-**

మండలంలోని గోందిగూడలో యుటిఎఫ్ సహకారంతో భీమిలి పట్నం కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సౌజన్యంతో నిరుపేద గిరిజనులకు,వృద్ధులకు చీరలు, రగ్గులు,టవల్స్ తో పాటు స్టీల్ బేసిన్స్,గ్లాసులు,స్టీల్ బాక్స్ లు ఉచితంగా పంపిణి చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేశారు.ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్ కే శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ కుటుంబ సభ్యులు జ్ఞాపకార్థంగా ప్రతి ఏడాది ఈ రకంగా వివిధ మండలాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిఇస్తున్నామన్నారు. మీరంతా చదువుకోవాలని, గంజాయి మాదకద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండి,చక్కటి జీవన విధానాన్ని అలవర్చుకోని ,ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మంచి లక్ష్యాలని పెట్టుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దేహదారుడు కలిగిన వారు అనేకమంది ఉన్నారని వారంతా పోలీసు, ఆర్మీలో సెలెక్ట్ అవడానికి కృషి చేయాలని దానికి కావలసిన సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఎన్ మూర్తి కే బానుజీ రావు, కే శ్రీనివాసరావు, యుటిఎఫ్ సభ్యులు ఏ పైడిరాజు, వి రాంబాబు,స్థానిక మండల అధ్యక్షుడు ఎస్ బాలకృష్ణ ,అల్లూరి జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు జి మహేశ్వరరావు, సహాధ్యక్షులు టి చిట్టిబాబు, కార్యదర్శి ఎస్ కన్నయ్య కార్యదర్శి ఎం బాబురావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా ఆదర్శ మహిళ అవార్డు గ్రహీత కృష్ణకుమారి.

**డుంబ్రిగుడ, జనవరి 19, మేజర్ న్యూస్:-**




మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షురాలుగా పనిచేస్తున్న కె.కృష్ణకుమారి చేస్తున్న సేవలను శారద ఎడ్యుకేషనల్ సొసైటీ గుర్తించి సౌత్ ఇండియా ఆదర్శ మహిళగా అవార్డు గ్రహీతగా హైదరాబాద్ బిర్లా మందిర్ ఆడిటోరియంలో సినీ నటి కవిత హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ చేతుల మీదగా సౌత్ ఇండియా ఆదర్శ మహిళగా అవార్డును సోమవారం కృష్ణకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ అయినప్పటికీ అంకితభావంతో సమాజ సేవకు చేస్తున్న కృష్ణకుమారికి వారు అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారు ఆకాంక్షించారు.

## అమిత్ షాకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదు




**నెల్లిమర్ల, జనవరి 19, మేజర్ న్యూస్:**

అంబేద్కర్ ని విమర్శించిన అమిత్ షాకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని వామపక్ష నాయకులు చెప్పారు. నెల్లిమర్ల మొయిద జంక్షన్ లో ఆదివారం సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ, ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి రాష్ట్ర పర్యటన వ్యతిరేకస్తూ అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మొయిద పాపారావు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, న్యూ డెమోక్రసీ నాయకులు కాళ్ల అప్పల సూరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకల పద్మ నాభం మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని అవమాన పర్చిన కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయలేదు సరికదా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పాల్పడే విధంగా గనులు కేటాయించకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపి, అమిత్ షా రాష్ట్రంలో తిరిగే హక్కు లేదని వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేశారు.అంతే కాకుండా రాజ్యాంగం నిర్మాత అంబేద్కర్ ని అవమాన పర్చి, రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా కి కూటమి నాయకులు వత్తాసు పలకడం భావ్యం కాదన్నారు. కాబట్టి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి, విభజన హామీలు అమలు, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ కి స్వంత గనులు కేటాయించి స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లో కలపి పరిరక్షంచాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో మరింత ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు కనకల రాము, సుంకర అప్పారావు, జగ్గిన్ని సత్యారావు, ఎం. అప్పన్న, సిపిఐ నాయకులు పి. సూరి, తదితరులు పాల్గొన్నారు.

## భీమిలి నియోజకవర్గంలో పార్టీ పెద్దలను కలిసిన భీమిలి నియోజవర్గం నూతన సమన్వయకర్త చిన్న శ్రీను



**భీమునిపట్నం, జనవరి 19, మేజర్ న్యూస్ :**

భీమిలి నియోజకవర్గానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా నూతనంగా నియమితులైన విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు జిల్లా పరిషత్ చైర్మన్ అయినటువంటి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆదివారం భీమిలి నియోజకవర్గ పార్టీ పెద్దలు అయినటువంటి మజ్జి వలస గ్రామానికి చెందిన దాట్ల పెదబాబుని మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రామునాయుడు ,పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు,పద్మనాభం సర్పంచ్ తాలాడ పద్దు, ఆనందపురం మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి దొండపూడిలో భూములు రీ సర్వే




**రావికమతం జనవరి 19 మేజర్ న్యూస్ :**

మండలంలో దొండపూడి గ్రామంలో సోమవారం నుంచి భూములు రీ సర్వే కార్యక్రమం ప్రారంభిస్తున్నామని డిప్యూటీ తాసిల్దార్ నానాజీ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు దొండపూడి లో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో జిరాయితీ భూములు 1836.87 ఎకరాలు, ప్రభుత్వ భూములు498 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్నాయన్నారు. రెవెన్యూ,సర్వే అధికారులు తొమ్మిది బృందాలు ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొంటున్నాయని తెలిపారు. రైతులు హక్కు సాగులో ఉన్న భూములను ఈ బృందాలకు స్వయంగా చూపించి ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏ కారణం చేతన గ్రామాంతరం వెళ్లిన యెడల సంబంధిత సర్వే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ రీ సర్వేలో ఎటువంటి తప్పులు దొర్లకుండా రైతులు సహకరించాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మూర్తి తదితరులు పాల్గొన్నారు .

## గ్రామాలలో ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇంటింటికి వైద్య సేవలు

### వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



**ఆనందపురం జనవరి19 మేజర్ న్యూస్**

గ్రామాలలో ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్యా శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం గుడిలోవ విజ్ఞాన విహార్ లో హెడ్గేవార్ నూతన ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను యూనిట్లుగా తీసుకొని, రాబోయే 6 నెలలులో ఇంటింటికి వైద్య పరిక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వివిధ రకాల వైద్య పరీక్షలు త్వరలో గ్రామాల్లో ప్రతి ఇంటికి. ప్రతి మనిషికి చేస్తామని గుర్తించిన కేసులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వైద్యం అందిస్తామన్నారు. ముఖ్యంగా స్త్రీలలో వచ్చే వివిధ రకాల కేన్సర్లుకు స్క్రీనింగ్ వైద్యం ఆయుష్మాన్ భారత్ ద్వారా అందుతోందని దీనిని అందరూ వినియోగించుకోవాలన్నారు, ప్రముఖ గుండె నిపుణులు డా. సి.వి.రావు మాట్లాడుతూ నేటి వర్తమాన పరిస్థితులలో మానవ జీవనశైలిలో వచ్చిన పెనుమార్పుల వలన అధిక రక్తపోటు, మధుమేహం వంటివి చిన్న వయస్సులోనే వస్తున్నాయని, సాంకేతిక సమాచారాన్ని తన విజ్ఞతతో తగు మోతాదులో ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్య అతిధి ఆర్.ఆర్.ఎస్.ఎస్. కార్యకారిణి సభ్యులు మాననీయ భాగయ్య మాట్లాడుతూ వ్యవసాయ సాగులో రసాయనిక ఎరువులు తగ్గించాలని గో ఆధారిత సేంద్రియ పద్ధతి ద్వారా సాగు చేయాలని, రైతులందరూ దీనికి సహకరించాలని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. వ్యవసాయ, ఉత్పత్తులు పెరగడం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమౌతుందని, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు గ్రామాల్లోనే ఉపసమనం లభించే ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చెందాలని కోరారు హెడ్గేవార్ నూతన ఆరోగ్య భవనానికి వీరితో పాటుగా కమిటి కార్యదర్శి జి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.వెంకటప్పడు, అధ్యక్షులు పి.వి. నారాయణయరావు పాల్గొనగా అఖిల భారత విద్యా భారతి అధ్యక్షులు, విజ్ఞాన విహార డైరెక్టర్ గౌ. దూసి రామకృష్ణ రావు మాట్లాడుతూ ముఖ్యంగా గత 40 సంవత్సరాలుగా హెడ్గేవార్ ఆసుపత్రి కొనసాగిస్తున్న సేవలు, గ్రామాల్లో గర్భిణి స్త్రీలకు ప్రసూతి సేవలు.. ఇలా ఎన్నో రకాల వైద్య సేవలను విస్తృతం చేస్తూ ఆరోగ్యకరమైన సమాజానికి డా. హెడ్గేవార్ ఆరోగ్య కేంద్రం సేవలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, యమ్ పి.టి.సి., ఆశా కార్యకర్తలు, మెడికల్ ఆఫీసర్స్, వైద్య వృత్తిలో ఉన్న పూర్వ విద్యార్థులు, కమిటీ సభ్యులు, సైక్షనిక్ ప్రముఖ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ విజయనగరంలో వామపక్షాల నిరసన




**విజయనగరం టౌన్, జనవరి 19, మేజర్ న్యూస్ :**

అమిత్ షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు ఆదివారం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ని పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ (ఎం ఎల్) నాయకులు బెహరా శంకరరావు మాట్లాడుతూ%ొ% దేశ రాజ్యాంగం మీద కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాకు నమ్మకం లేదనడానికి అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలు నిదర్శనమన్నారు. మరో వైపు విభజన చట్టంలోని ఏ హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. ప్రత్యేక హోదా అమలు చేయకుండా, రైల్వే జోన్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నష్టాల్లోకి నెట్టి దానికి బొగ్గు గనులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు స్టీల్ ప్లాంట్ ను అమ్మాలని చూస్తున్నారని, అందువల్లే స్టీల్ ప్లాంట్ కు స్వంత ఘనులు కేటాయించకుండా నిరక్ష్యం చేస్తున్నారన్నారు. నిధులు కేటాయించడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సెయిల్ లో విలీనం చేయడం ద్వారానే విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించుకోగలమన్నారు. అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఘనులు కేటాయించి, సెయిల్ లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్రమంత్రి పర్యటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేసే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమమలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టి వి రమణ, సి హెచ్ వెంకటేష్, అర్ ఆనంద్, వి.లక్ష్మి, సి పి ఎం ఎల్ నాయకులు అప్పలరాజు పాల్గొన్నారు

## రావికమతం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గా బండారు రాజారావు.



**రావికమతం జనవరి 19 మేజర్ న్యూస్:**

రావికమైన మండలం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా బండారు రాజారావు నియమితులయ్యారు. చోడవరం సాయిదేవి ఫంక్షన్ హాల్లో జిల్లా ఆర్య వైశ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు గా రాజారావు, కార్యదర్శి గా పోలిశెట్టి కృష్ణపరమత్మ ను మహాసభ అధ్యక్షులు చిన్న రాము సత్యనారాయణ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహాసభ అధ్యక్షులు శ్రీనాధుని మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి

### ఆహ్లాదకరమైన వాతావరణంతోనే ఉత్తమ ఫలితాలు.

### కాశీబుగ్గ సీఐ సూర్య నారాయణ.



**పలాస, జనవరి 19, మేజర్ న్యూస్**

స్వచ్ఛ ఆంధ్ర లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం సిద్ధిస్తుందని కాశీబుగ్గ సీఐ సూర్య నారాయణ అన్నారు.స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణలో పరిసరాలను ఆదివారం శుభ్రపరిచారు.సిఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు సిబ్బంది అంతా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై పోలీసు స్టేషన్ పరిసరాలలో గల పిచ్చిమెక్కలను తొలిగించి పరిశుభ్ర వాతావరణం చేపట్టారు.ఈ సందర్భంగా కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ ఆంధ్రా,స్వచ్ఛదివస్ అనే కార్యక్రమం ప్రవేశపెట్టి పరిసరాలు పరిశుభ్రతకు శ్రీకారం చుట్టిందని అన్నారు.అందులో భాగంగా మన ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అదే విదంగా మన పొలీస్ స్టేషన్ వివిద ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశ్యంతో తన సిబ్బందితో కలిసి కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం చేపట్టి పరిసరాలను శుభ్రం చేయడం జరిగిందన్నారు.గాంధీజీ కలలుగన్న పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ ఎస్ఐ ఎం.చంద్రరావు,పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పాల్తేరు మల్లంపేటలో పశు ఆరోగ్య శిబిరాలు

బాడంగి, జనవరి 19, మేజర్ న్యూస్:
జాతీయ పశు వైద్య నియంత్రణ పథకం సౌజన్యంతో పశు సంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు ఈ నెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు అని దీని లో భాగంగా బాడంగి మండలంలో వివిధ గ్రామాలలో ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్య అధికారి డాక్టర్ ఎం సతీష్ తెలిపారు ఆదివారం ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడుతూ సోమవారం పాల్తేరు, మల్లంపేట గ్రామాల్లో దీనిని నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు ఈ శిబిరాలలో నట్టల నివారణ కార్యక్రమము, వ్యాధి నిరోధక టీకాలు అనారోగ్య పశువులు పరీక్షించబడతాయి కావున పాడి రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## పారిశ్రామిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

### - ఎంఎస్ఎంఈ డిజీఎం ప్రసాద్ రెడ్డి



నరసన్నపేట, జనవరి 19, మేజర్ న్యూస్ :
విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల, భవిష్యత్తులో వారికి ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని విశాఖపట్నం ఎంఎస్ఎంఈ ( సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ) టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి అన్నారు. విశాఖపట్నం టెక్నాలజీ సెంటర్ లో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన పారిశ్రామిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు పారిశ్రామిక నైపుణ్యాలు ఉండాలని అప్పుడే వారికి వాస్తవ-ప్రపంచ అనుభవం లభిస్తుందని తెలిపారు. టెక్నాలజీ సెంటర్ల ద్వారా చిన్న పరిశ్రమలకు మరింత ఊతమివ్వడం ఎంఎస్ఎంఈల ప్రధాన లక్ష్యమని అన్నారు. టెక్నాలజీ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం కాలీబ్ మాట్లాడుతూఇంజనీరింగ్ పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను తయారచేయడమే ధ్యేయంగా ఈ స్కిల్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ డా కే మురళీ కృష్ణ, పద్మావతి కళాశాల డైరక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డా మాకేనా సతీష్ పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందజేశారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం...



నరసన్నపేట జనవరి 19 మేజర్ న్యూస్ :
సారవకోట మండలం బుడితి ఉన్నత పాఠశాలలో 1984 - 85 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆనాటి విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకొని నాటి మధురస్మృతులను గుర్తు చేసుకుని స్నేహితులతో అనుబంధాలను పంచుకున్నారు. నాటి గురువులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. ఆనాటి ఉపాధ్యాయులు తెలికి చర్ల రాజేశ్వరరావు, నిక్కు హరిసత్యం, పొన్నాల బాలకృష్ణ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . ఈ కార్యక్రమంలో నిక్కు సత్యం, నిక్కు రాజశేఖర్ ధర్మాన రామకృష్ణ, బోయిన వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు

నరసన్నపేట జనవరి 19 మేజర్ న్యూస్ :
బాల్యంలో అందరూ కలిసి విద్యను అభ్యసించారు. వాట్సాప్ పుణ్యమా అంటూ అందరూ గ్రూపులో క్షేమ సమాచారం తో పాటు బాల్యం యొక్క గుర్తులు తలుచుకొని ఆనందపడ్డారు. జనవరి 17వ తేదీన 2002 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకొని అందరూ దీర్ఘాసి ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. కొంతమంది ఉద్యోగులు, మరికొందరు వ్యాపారస్తులు, మరికొందరు వివిధ ప్రైవేట్ సంస్థల్లో మంచి



హోదాల్లో, మరి కొంతమంది వ్యవసాయాలు చేస్తూ ఉన్నతంగా బ్రతుకుతున్నారు. తన మిత్రుడు అనారోగ్యముతో మరణించడంతో మిత్రుల హృదయం కలచవేసింది. వెంటనే 30 వేల రూపాయలు పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డిపాజిట్ చేశారు. అంతటితో ఆగకుండా మిత్రుడికి ఆడపిల్ల ఉందని తెలుసుకుని మరో 25 వేలు పెట్టి బంగారాన్ని కొని మిత్రుడు భార్యకి అందించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందం పంచుకోవడం కోసమే కాదని , తమ మిత్రులు ఆపదలో పాలుపంచుకొని సహాయం అందించడం ఆనందం గా ఉందని మిత్ర బృందం తెలపడం గొప్ప విషయం.కష్టం వస్తే ఒక్కరికి చాలా ఇబ్బందిగా ఉంటుంది అదే కష్టాన్ని గ్రామస్తులు గాని స్నేహితులు గాని తల ఒక చేయి అందిస్తే కష్టం నుండి మనిషిని గట్టు ఎక్కించవచ్చని మిత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం మొత్తం పాల్గొన్నారు.

### 02 నుండి 6 సంవత్సరాల పిల్లలకు

# ఆధార్ నమోదు తప్పనిసరి

### ఎంపీడీవో ఎస్ రామకృష్ణ



బాడంగి, జనవరి 19, మేజర్ న్యూస్:
02 నుండి 6 సంవత్సారాలు వయస్సు లోపు పిల్లలందరూ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపీడీవో ఎస్ రామకృష్ణ అన్నారు ఆదివారం ఆయన చర్వాణి ద్వారా సూర్య ప్రతినిధితో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయం మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలను సారంగా చిన్నారులంతా ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని భవిష్యత్తులో సంక్షేమ పథకాలు విద్యార్థులు చదువులు ఉద్యోగాలు తదితర అన్నింటికీ కూడా ఆధార్ ముఖ్యమైనదని కావున చిన్నారులు తల్లిదండ్రులు దీనిని దృష్టిలో పెట్టుకొని ఇంకా ఆధార్ నమోదు చేసుకోలేని చిన్నపిల్లలు ఎవరైనా ఉంటే తప్పని సరిగా వారి చేత ఆధార్ నమోదు చేయించాలని ఆయన అన్నారు దీనికోసం మండలంలోని గజరాయిని వలస గ్రామంలో ఆధార్ కేంద్రం ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు అంతేకాకుండా మండలంలో ఏదైనా గ్రామపంచాయతీలో ఆధార్ నమోదు చేసుకోకుండా ఎక్కువమంది చిన్నపిల్లలు ఉండి ఉంటే వారి సౌలభ్యం కోసం అదే గ్రామంలో ఆధార్ కేంద్రం ను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు.

## ఘటాలకు ముందుర తిరువీధి చేసే అమ్మవారి పాలదాగర

### అమ్మ వారు నడిచే దారిని తుడిస్తే ఎంతో భాగ్యం

మక్కువ, జనవరి 20,మేజర్ న్యూస్:-
ఉత్తరాంధ్రల ఇలవేల్పు , కోరిన కోర్కెలు తీర్చే కల్పవలిగా పేరొందిన శంబర శ్రీ పోలమాంబ అమ్మవారి ఘటాలకు ముందు చదురు గుడి నుండి తిరువీధి చేసిన అమ్మవారి పాలధాగరకు కూడా విశిష్టత సంతరించుకుంది. ఈనెల 27 , 28 , 29 వ తేదీల్లో జరగనున్న శంబర శ్రీ పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా శ్రీ చినపాలమాంబ వారు శంబర గ్రామంలో రోజు తిరువీధి చేస్తున్నారు. అమ్మ వారు తిరువీధికి బయలుదేరడానికి ముందు చదురు గుడి నుండే పాల దాగర తిరువీధి చేస్తుంది.మధ్యాహ్నం రెండు గంటల సమయానికి చదురు గుడి నుండి గ్రామంలో తిరువీధికీ పాల దగ్గర ప్రతిరోజు బయలుదేరుతుంది. అమ్మవారు ఘటాలు ఏ వీధిలో అయితే తిరుగుతాయో అదే వీధుల్లో పాలదాగర ముందుగా గ్రామంలో తిరువీధి చేయ విశేషం. పాలధాగర తిరువీధి చేసిన తర్వాతనే అమ్మవారి ఘటాలు రాత్రిపూట తిరువీధికి బయలుదేరుతారు. పాలదాగర తిరువీధికి వచ్చే సమయంలో గ్రామానికి చెందిన ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా వారు దాచుకునే బియ్యంలో కొన్ని అమ్మవారి పాలదాగరలో వేయడం ఆనవాయితీ. ఇలా వారు వండుకున్న బియ్యంలో కొన్ని అమ్మవారి పాలదాగరలో వేస్తే , వాటిని అమ్మవారు అన్నం వండుకొని స్వీకరిస్తారని గ్రామస్తుల నమ్మకం.ఇలా అమ్మవారి పాలదాగర గ్రామం అంతటా తిరిగి, చివరికి చదురు గుడికి చేరుకుంటుంది. తదుపరి అమ్మవారి ఘట్టాలు రాత్రిపూట గ్రామంలో తిరువీధి చేసి యాత్రాస్థలం లో గల గద్దే వద్దకు చేరుకొంటాయి. అక్కడ ఏర్పాటు చేసిన వినోద కార్యక్రమాలను కాసేపు జన సమూహం తో తిలకించి, తదుపరి అర్ధరాత్రి సమయంలో చదురు గుడికి అమ్మవారి ఘటాల చేరుకుంటాయి.

**అమ్మ వారు నడిచే దారి తుడిస్తే ఎంతో భాగ్యం :** శ్రీ పోలమాంబ అమ్మవారు







నడిచే దారిని తుడిస్తే ఎంతో బాగ్యమనీ భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలోనే మహిళలు అమ్మవారిని దర్శించుకున్న పిమ్మట చదురు గుడి నుండి సమీప గోముఖీనది వరకు అమ్మ వారు నడిచే దారిని చీపురుతో తుడుస్తారు. ఇలా గోముఖి నది వరకు దారి తుడిచి నదిలో కాళ్ళు చేతులు శుభ్రం చేసుకుని తమ ఇళ్లకు చేరుకుంటారు.

## ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డార్మెంటరీ భవనాలు

పూసపాటిరేగ, జనవరి 19, ( మేజర్ న్యూస్):
మండలంలోని కొప్పెర్ల గురుకుల విద్యాలయానికి సి ఎస్ ఆర్ నిధులు కింద ఎస్ఎంఎస్ పరిశ్రమ నిధులు సమకూర్చడంతో పనులు వేగవంతంగా సాగి ప్రారంభానికి సిద్ధమైంది. గురుకుల విద్యార్థులకు పాత డార్మెంటరీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు పలు అవస్థలు పడుతున్నారు. దీనితో పైకప్పు పిచ్చులు కూడా పడిపోవడంతో పాటు గోడలు కూడా పగుళ్లు రావడంతో విద్యార్థులు నానా అవస్థలు పడే పరిస్థితి ఉండేది. దీనితో గత వైకాపా ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న బడ్డుకొండ అప్పలనాయుడు ఎస్ఎంఎస్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి కొత్త డార్మెంటరీ భవనాలకు నిధులు మంజూలయ్యేలా ముమ్మర్ ప్రయత్నాలను అప్పట్లో చేశారు. దీనితో బొడ్డు కండ కృషి ఫలితంగా రూ. 1.50 కోట్ల వ్యయంతో భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు అయ్యాయి. ఆ విలువెంటనే బడ్డుకొండ ఎస్ఎంఎస్ పరిశ్రమ యాజమాన్యంతో శ్రీకారం చుట్టారు. అప్పట్నుంచి పనులు వేగవంతంగా జరగడంతో పనులు కూడా పూర్తయి భవన సముదాయ ప్రారంభానికి సిద్ధమయింది.ఈ భవనాలను ప్రారంభిస్తే భయం



భయంగా కాలక్షేపం చేస్తున్న పాత భవంతుల సమస్త నుంచి ఉపశమనం లభిస్తుందన్న ఆశాభావాన్ని విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు.

### ఎమ్మెల్యే శంకర్‌ను అవినందించిన

# పాలకొండ రోడ్డు వర్తకులు

**పాలకొండ రోడ్డును ఆహ్లాదకరంగా తయారు చేసేందుకు చర్యలు**

**రహదారి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ ,పాలకొండ రోడ్డు వర్తకుల విజ్ఞాపనను పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్**

శ్రీకాకుళం, జనవరి 19, మేజర్ న్యూస్:
నగరంలో పాలకొండ రోడ్డు నందు చేస్తున్న అభివృద్ధి పనులపై ఆ మార్గంలో ఉన్న వర్తకులు పెద్ద సంఖ్యలో శ్రీకాకుళం శాసనసభ్యుని క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గొండు శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వర్తకులు తన అభిప్రాయాలను శాసనసభ్యునికి తెలియజేశారు. దీనిపై సానుకూలంగా స్పం దించిన శాసనసభ్యులు అందరి ఆమోదంతో మరింత ఆహ్లాదకరంగా తయారు చేసేందుకు కృషి చేద్దామని తెలిపారు. కొందరు సెంటర్ పార్కింగ్ పెడితే బాగుంటుంది అని తెలియజేయగా కళింగపట్నం శ్రీకాకుళం పార్వతీపురం సిఎస్పి రోడ్డు ఎస్ హెచ్ వన్ గా ఉన్న ఈ రహదారిలో 60 అడుగులు పైబడిన ప్రతి రహదారి మార్గంలో కూడా సెంటర్ పార్కింగ్ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత



ఉన్నదని రోడ్డు నిబంధనల ప్రకారం సెంటర్ పార్కింగ్ అందరికీ ఆమోదయోగ్యంగా తయారుచేసి, మరింత తేజవంతమైన విద్యుత్ దీపాలతో అభివృద్ధి చేద్దామని, పర్యావరణహితమైన ఆహ్లాదకరమైన మొక్కలను నాటి అందరూ ఆమో దంతో అభివృద్ధికి చర్యలు తీసుకుందామని తెలియజేశారు. పాలకొండ రోడ్డు వర్తకులు శ్రీకా కుళం శాసనసభ్యులు శంకర్ ను దుశ్శాలువతో సత్కరించారు. అభివృద్ధికి సహకరించిన వర్తకులు అందరికీ అభినందించవలసిన బాధ్యత ఉన్నదని శాసనసభ్యులు పేర్కొన్నారు. సందర్భంగా పలువురు శ్రీకాకుళం పట్టణ ప్రముఖులు వివిధ రంగాల వర్తక వాణిజ్య వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో యోగి వేమన జయంతి



శ్రీకాకుళం టౌన్, జనవరి 19, మేజర్ న్యూస్:
జనవరి 19 వ తేదీన యోగి వేమన జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పి (అడ్మిన్) శ్రీ కెవి రమణ వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పి మాట్లాడుతూ సమాజంలోని అన్ని సమస్యలను భిన్న కోణాల్లో దర్శించి ఆ వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించాడని కొనియాడారు.ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాష,చక్కటి పద జాలం, ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా వేమన పద్యాల రూపంలో సమాజానికి అర్థం అయ్యే రీతిలో చెప్పారని పేర్కొన్నారు.ఈ జయంతి వేడుకలో ఆర్మ్డ్ రిజర్వ్ డిఎస్పీ ఎల్. శేషాద్రి,ఆర్ఐ కె. నర్సింగా రావు, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

### పలు పత్ర ద్రావణంతో

## చీడపీడలు నివారణ




బాడంగి, జనవరి 19, మేజర్ న్యూస్:
పలు పత్ర ద్రావణమును పంట పొలంలో వినియోగించడం ద్వారా చీడపీడలు నివారణ జరిగి తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన అధిక పంట దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై సత్యనారాయణ అన్నారు ఆదివారం ఆయన ఆధ్వర్యంలో కోడూరు గ్రామంలో పలుపాత్ర ద్రావణం తయారు చేయు విధానం పై రైతులకు అవగాహన కల్పించారు మూడు కేజీలు వేపకు మూడు కేజీలు జీలేడాకు, మూడు కేజీలు కామాకు, మూడు కేజీలు బొప్పాయి ఆకు, మూడు కేజీల ఉమ్మెత్త ఆకు, మూడు కేజీలు జామాకు. మూడు కేజీల సీతాఫలం ఆకు 15 లీటర్ల ఆవు మూత్రం, 200 లీటర్లు నీటిలో ఆ ఆకులన్నీ వేసి ఆరు రోజులు మురుగు నివ్వాలి ప్రతిరోజు నవ్య దిశలో కలపాలి అప్పుడు పలుపత్ర ద్రావణం తయారవుతుందని ఆయన అన్నారు ఈ ద్రావణాన్ని ప్రతి పంటలో వినియోగించుకోవచ్చు. దీనివల్ల చీడపీడలు నివారణ మరియు రసం పీల్చే పురుగులు పంటకు ఆశించవని పంటలు ఏపుగా పెరుగుతాయి అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం సుభద్ర రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవి యోగివేమన

### - శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

### - కలెక్టరేట్ లో ఘనంగా యోగి వేమన జయంతి కార్యక్రమం

శ్రీకాకుళం, జనవరి 19, మేజర్ న్యూస్:
యోగివేమన ప్రజాకవి అని, గొప్ప తాత్వికవేత్త అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కలెక్టరేట్ లో ఆదివారం యోగివేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ యోగి




వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగి వేమన పద్యాలు ఎంత సరళంగా, స్పష్టంగా, అర్థవంతంగా ఉంటాయో ఆ పద్యాలకు ఉన్న ఆదరణ తెలియజేస్తుందన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని తెలుగు వారు ఉండరని ఎమ్మెల్యే చెప్పారు. వానకు తడవని, వేమన పద్యం చదవని వారు ఉండరనే నానుడి ఇప్పటికీ ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి, ప్రజల్ని వేమన మెప్పించాడన్నారు. ఆటవెలదితో అద్భుతమైన కవిత్వం, అనంతమైన విలువ గల సలహాలు, సూచనలు, విలువలు, తెలుగు సంగతులు ఇమిడ్చారు వేమన అని వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శిర రమణయ్య, జిల్లా అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరాల గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కోళ్ల




లక్కవరపుకోట, జనవరి 19, మేజర్ న్యూస్ :-
రాష్ట్ర ప్రభుత్వము జనవరి 20వ తేది సోమవారం నుంచి 31 వ తేదీ వరకు నిర్వ హిస్తున్న తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాల గోడ పత్రికను ఆదివారం ఎస్ కోట నియోజక వర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి రైతులకోసం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ శిబిరాలలో పశువైద్య చికిత్సలు, గర్భ కోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యం పై అవగాహన వుంటాయని పాడి రైతుల శ్రేయస్సుకి ఈ శిబిరాలు ఏంతో ఉపయోగ పడతాయి అన్నారు ఈ కార్యక్రమం షెడ్యూల్ ను ఎల్ కోట పశువైద్య శాల వైద్యురాలు కె గాయత్రి ఎమ్మెల్యేకి వివరించారు .ఈ కార్యక్రమం డాక్టర్ గాయత్రి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణ కోసం బారికేడ్ల ఏర్పాటు

ఆమదాలవలస, జనవరి 19, మేజర్ న్యూస్
రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జంక్షన్ల వద్ద బారికేడ్లను (స్టాపర్ల) ఏర్పాటు చేసినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. ఆమదాలవలస పట్టణం పరిధిలో కొర్లకోట జంక్షన్, సెయింట్ ఆన్స్ స్కూల్ జంక్షన్ల వద్ద ఆదివారం స్టాపర్లను ఏర్పాటు చేశారు. అధిక స్పీడ్ తో వస్తున్న వాహనాల స్పీడ్ ను నివారించేందుకు ఈ బారికేడ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు.



## కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను

# వ్యతిరేకిస్తూ సిపిఎం నాయకుల రాస్తారోకో

**లక్కవరపుకోట, జనవరి 19, మేజర్ న్యూస్:**
లక్కవరపుకోట్ట మండలముల కేంద్రం లోని విశాఖ అరకు ప్రధాన రహదారి పై అంబేద్కర్ కూడలి వద్ద అదివారం కేంద్ర హెూమ్ మినిస్టర్ అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు సిఐటియుజిల్లాకార్యదర్శి మద్దిలరమణ మాట్లాడుతూ మనదేశ సమైక్యతం సంస్కృతి మత విశ్వాసాలు వంటి విషయాల్లో మనదేశంలోనూ మన మన రాష్ట్రంలోనూ కూడా ఎంతో వైవిధ్యం ఉంది ఈ వైవిధ్యం మన దేశానికి ఒక గొప్ప విశిష్టతను ఇచ్చింది పూలతోపాటు ముళ్ళు ఉన్నట్టే మన గతము నుండి అంటరానితనం స్త్రీ లను తక్కువ చేసి చూస్తూ వారిపై అఘాయిత్యాలకు పాల్పడటం వంటి సంఘటనలు ఈదేశం లో కొనసాగుతూన్నాయి ఇవన్నీ పోయి ప్రజాస్వామ్యంలో ప్రజలందరినీ అభివృద్ధి పథంలో నడిపించాలంటే ప్రభుత్వం లౌకిక విలువలను అవశ్యంగా గౌరవించి పాటించాలని రాజ్యాంగం ఆదేశించింది అయితే ఇటీవల కాలంలో రాజ్యాంగం నిర్దేశించిన మార్గాల పురోగమనం వైపుగా దేశాన్ని నడిపించే బదులు ఆ విలువలకు తూట్లు పొడుస్తూ దేశాన్ని తిరోగమనం దశలోకి నడిపించే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి అని వీటికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వాటి ఆధీనంలో ఉండే వివిధ వ్యవస్థలు వారిని వెనక నుండి నడిపిస్తున్న సంఘపరివారు తోడ్పాటు అందిస్తున్నాయి అని మత విశ్వాసాలను రాజకీయాన్ని దేనికదిగా వేరువేరుగా ఉంచాలని మతాన్ని రాజకీయంలోకి పబ్లిక్ లోకి తీసుకు రాకూడదని మతం శక్తి యొక్క ప్రైవేటు వ్యవహారంగా మాత్రమే చూడాలని మహాత్మా గాంధీ నిత్యం చెప్తూ వచ్చారు అని అదే స్ఫూర్తితో బాబాసాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో లౌకిక భారత రాజ్యాంగం రూపొందింది కానీ లౌకికత్వానికే కొత్త భాష్యాలు నేటి బీజేపీ ప్రభుత్వము చెబుతుంది అని కొందరు లౌకిక తత్వం మత విశ్వాసాలకు వ్యతిరేకం అన్న పదాన్నీ ప్రచారం చేస్తున్నారు అని వ్యక్తిగత విశ్వాసంగా ఉండే మతం విషయంలో మెజారిటీ మైనారిటీ తేడాలు ముందుకు తెచ్చి ప్రజల సమైక్యతను దెబ్బతీసి విద్వేషాలను రాజేస్తున్నారు అన్నారు మత స్వేచ్ఛ ప్రజల వ్యక్తిగత హక్కు అన్ని మత విశ్వాసాల ప్రజలకు భరోసా కల్పించాల్సిన కేంద్రం మైనార్టీల మీద దాడులు చేస్తున్న దుష్టశక్తులకు తోడ్పాటు ఇస్తుంది అని ఆరోపించారు మరోపక్క మెజారిటీ మతం మీదే దాడులు జరిగిపోతున్నాయి అంటూ మొత్తం ప్రజలందరిలోనూ అభద్రత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు అన్నారు అలాగే బంగ్లాదేశ్లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై జరుగుతున్న




దాడుల్ని సిపిఎం ఖండిస్తుంది అని మనదేశంలో మైనారిటీలకు కూడా భద్రత కల్పించాలని కోరుతున్నది అన్నారు మతోన్మాదం ఏ పేరుతో ఉన్న ఖండిస్తున్నది అన్నారు మతాలతో సంబంధం లేకుండా ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తున్నది సంవత్సరం పైగా మణిపూర్ రాష్ట్రం రావణ కష్టంలా కాలుతున్న దానిపై చూసే తీరిక కేంద్రంలో బిజెపి మోడీకి లేదు కానీ మోడీ గారికి విదేశాలు తిరుగుతూ మునిగి తేలాడుతున్నారు అని ఇటువంటి నాయకులు దురదృష్టవశాత్తు కేంద్రంలో పాలకుల గా వున్నారని దుయ్యబట్టారు . దీన్ని ఖండించడానికి ప్రధానికి నోరు రావట్లేదు మణిపూర్లో స్త్రీలను నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్లు జరుగుతున్న పట్టించుకునే పరిస్థితి లేదు మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణ హెూమాన్ని ప్రజలకు తెలియనివ్వకుండా శాటిలైట్ సౌకర్యం లేకుండా కేంద్రంలో బిజెపి మణిపూర్ లో ఉన్న బిజెపి ప్రభుత్వం దుర్మార్గ వైఖరిని అవలంబిస్తుందన్నార రాజ్యాంగ రూపశిల్పి బాబాసాహెబ్ అంబేద్కర్ని సైతం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా పార్లమెంటు సాక్షిగా అమిత్ షా అవమానపరిచే స్థాయికి దిగజారారు అని ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేకి హెూం శాఖ మంత్రిగా కొనసాగే అర్హత లేదు అన్నారు ఇతను దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు అన్నారు హిందూ దేవాలయాలపై ప్రభుత్వం జోక్యం వద్దని హిందువులే ఆధిపతులుగా ఉండాలని ప్రచారం చేస్తున్న మతోన్మాదులు అదే హిందువుల్లో 80% గా ఉన్న దళిత ఆదివాసి బడుగు బలహీన జనానికి మహిళలకు సమానత్వం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు అనగారిన కులాలను అణచివేయడానికి మతోన్మాదాన్ని అస్త్రంగా వాడుకుంటున్నారు అని మరో వైపు ముస్లిం ఆస్తులపై వర్ఫ్ కేంద్రం ఆధిపత్యానికి వక్ఫ్ బోర్డ్ లో ముస్లిం యేతరులు ఉండాలని షరతులు విధిస్తున్నది అని ఇదే న్యాయం మసీదుల్ని తవ్వి గుళ్ళు కట్టాలని వివాదాలు రేకెత్తిస్తున్నారు అని ఇలా హిందూ ముస్లిం విభేదాలు రేపడం వలన దేశాన్ని బలహీన పరుస్తాయి అన్ని మతాల మధ్య సఖ్యత దేశ అభివృద్ధికి పునాది ప్రజల చుట్టూ ఇలా విద్వేషాలు త్వరలో తరచి ఆ చాటున దేశ సంపదను కొద్దిమంది తమ ఆ స్త్రీలకు సమర్పిస్తున్నారు అంతర్జాతీయంగా అవినీతి అభియోగాలను ఎదుర్కొంటున్న ఆదాని నీ రక్షించడానికి ఎంతకైనా తెగిస్తున్నారు వారికి సంపద పోగేయడం కోసం సామాన్య ప్రజల మీద భార్యలను రోజురోజుకు పెంచుతున్నారు విరిగిపోతున్న నిరుద్యోగాన్ని పేదరికం ని ప్రజల ఇది బాధల్ని పట్టించుకోవడం లేదు ప్రజలుపోరాడకుండాదారితప్పించడానికి మతోన్మాద విశ్వవిద్యాలు వెదజల్లుతున్నారు రాష్ట్ర విభజన అనంతరం దశాబ్ద కాలంగా మన రాష్ట్రానికి కేంద్రం అన్యాయంచే స్తూనే ఉంది దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలను చేర్చడానికి మతోన్మాద శక్తులు ఇలాంటి అగ్గి రగిలించేందుకు ప్రయత్నిస్తున్నాయి అని ఈ కుట్రలను తిప్పికొడదాం మన మందరం భారతీయుల మేనంటూ మన స్వేచ్ఛను గౌరవిద్దాం మతరాజకీయాలకు దూరంగా ఉందాం అనిఅన్నారు ఈ కార్యక్రమంలో టీ.వీ రమణ బి. దేవుడు. కె ఎర్నమ్మ. బి.ఎర్రమ్మ ఎం సూర్యుడు కే నాగరాజుతదితరులు పాల్గొన్నారు.

---

## ఏరియా ఆసుపత్రిలో

# ఉరి వేసుకొని ఆత్మహత్య

**పాలకొండ, జనవరి 19,మేజర్ న్యూస్ :**
స్థానిక ఏరియా ఆసుపత్రి లో ఆదివారం వార్డు బాత్ రూమ్‌లో బేవర జోగినాయుడు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు.వీరఘట్టం మండలం తలవరం గ్రామంకు చెందిన బెవర జోగినాయుడు (45) పేంక్రియాక్టిక్ తో నిన్న పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చేరాడు.ఆదివారం



తెల్లవారు జామున మేల్ మెడికల్ వార్డ్ బాత్ రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో పోలీసులుకు ఆసుపత్రి సిబ్బంది పిర్యాదు చేశారు. పోస్ట్ మార్టం గదికు మృతదేహం తరలించారు.పేంక్రియాక్టిక్ (కడుపునొప్పి తాళలేక) ఆత్మహత్య చేసుకున్నట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు.మృతుడు జోగినాయుడుకు బార్య కళ్యాణి,ఇద్దరు పిల్లలు వెంకేటష్ (19) సూర్యకళ (15) వున్నారు. ఆసుపత్రి వద్ద బంధువులు ఆందోళన నిర్వహించారు. దీంతో మృతురాలు బంధువులుతో పోలీసులు చర్చలు జరిపారు.

# ఎన్టీఆర్‌కి ఘన నివాళి

**కోటబొమ్మాళి, జనవరి 19, మేజర్ న్యూస్:**
పేదల పెన్నిది, తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, దివగంత ముఖ్యమంత్రి, ప్రముఖ సినీనటుడు నందమూరి తారక రామారావు ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని, తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాల్లో చాటి చెప్పిన మహనీయుడని, ఆయన ఆశయ సాదనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ పీఏసీఎస్ అద్యక్షువు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ రాష్ట్ర



కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. శనివారం ఎన్‌టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక పాతబస్‌స్టాండ్ అవరణంలో నిర్మించిన పార్కులో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి, మండల పరిషత్ అవరణలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి, టిడిపి కార్యాలయ అవరణలో ఉన్న ఎన్‌టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహానికి మండల టీడీపీ పార్టీ అద్యక్షుడు బోయిన రమేష్ ఆద్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కీర్తికి 9 నెలల్లో ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్‌టీఆర్ యని, ముఖ్యమంత్రిగా నిరుపేదల అభ్యున్నతికి ఆయన యనలేని కృషి చేశారని తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టెక్కలి నియెజకవర్గ మహిళ అద్యక్షరాలు పూజారి శ్శైలజ, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు కల్లి నాగయ్యరెడ్డి, పట్టణ టిడిపి అద్యక్షుడు కోరాడ గోవిందరావు, కల్లి లక్ష్మణరెడ్డి, పట్ట సింహాచలం, జెడ్‌పీటీసీ ప్రతినిధి నంబాళ్ళ శ్రీనివాసరావు, కర్రి అప్పారావు, లాడి శ్రీనివాస్, పార్టీ నాయుకులు నాళ్ళ ఆదినారాయణ (చిన్ని), తదితరులు పాల్గొన్నారు.

---

## జీవో 117 సవరణలో

# లోపాలను సరి చేయండి

**ఆమదాలవలస, జనవరి 19, మేజర్ న్యూస్**
జీవో 117 సవరణలో లోపాలను మార్పులు చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కు శ్రీకాకుళం యూనిట్ ఎస్ టి యు ఆదివారం



వినతి పత్రం అందజేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్ పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయడం మంచి శుభ పరిణామని కాకపోతే సమీప పాఠశాలల నుంచి మూడు,నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్లో కలపకుండా వాటిని యధావిధిగా పాతపద్ధతిలో ప్రైమరీ స్కూల్ గానే కొనసాగించాలని అన్నారు. మోడల్ ప్రైమరీ స్కూలు పంచాయతీ కేంద్రంగా ఉండాలని అప్ గ్రేడ్ కాకుండా మిగిలిన యూపీ స్కూలును యదావిధిగా కొనసాగించాలని అన్ని ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్,పీఈటీ పోస్టులు ఉండాలని, ఎం టి ఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని ఎస్టీయూ జిల్లా నాయకత్వం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.ఎమ్మెల్యే స్పందించి ఈ సమస్యను విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎస్. వి. రమణ మూర్తి, జి. రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాసరావు, జి. శ్రీనివాసరావు, కె. తేజేశ్వరరావు, ఎ. జగన్, ఎమ్. తేజేశ్వరరావు, డి.వి. యన్ పట్నాయక్, జాక శ్యాంసుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతి బా పూలె పాఠశాలలో అదనపు తరగతులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోళ్ల

**లక్కవరపుకోట, జనవరి 19, మేజర్ న్యూస్:**
మండలములోని జమ్మదేవిపేట గ్రామ కేంద్రంగా పనిచేస్తున్నా కొత్తవలస మహాత్మ జ్యోతిబా పూలే బిసి బాలికల పాఠశాల లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు విద్యార్థినీలకి తరగతి గదులు చాలక ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకున్న యజమాని కోళ్ల రాంప్రసాద్ నూతన గదుల నిర్మాణం చేపట్టారు ఈ కార్యక్రమములో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోళ్ల రాంప్రసాద్ ప్రిన్సిపల్ యూ విజయకుమార్ టీడీపీ నాయకులూ కొట్యాడ ఈశ్వరరావు తదితరులు పాలొన్నారు.



---

# బాధ్యతగా రీ సర్వే నిర్వహించండి

**రైతుల సమస్యల పరిష్కారానికి రి సర్వే - ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్**

**సరుబుజ్జిలి, జనవరి 19, మేజర్ న్యూస్**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండవ దశ భూ రీ సర్వే ను అధికారులు బాధ్యతగా నిర్వహించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి మండలం యరగాం గ్రామంలో ఆదివారం నిర్వహించిన రిసర్వే ర్యాలీలో ఆయన పాల్గొని, గ్రామ సభలో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే ద్వారా ఎనిమిది లక్షల ప్రభుత్వ భూములను వైకాపా నాయకుల పేర్లు నమోదు చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రభుత్వ భూములు కాపాడటానికి రి సర్వే రెండవ దశ నిర్వహించవలసి వచ్చిందని, రెవెన్యూ గ్రామ సచివాలయం ఉద్యోగులు రీసర్వే ద్వారా ప్రభుత్వ భూములు కాపాడటానికి కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామ కంటాలు, ప్రభుత్వ భూములు, దేవాలయ భూముల పట్ల అధికారులు సమగ్ర సర్వే జరిపి నివేదికల రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎల్ మధుసూదన్, డిటి జగదీష్, సర్వేయర్ సూర్యనారాయణ, టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, తర్లాడ సురేంద్ర, గురువు తిరుమలరావు, అంబల్ల రాంబాబు, నూక కోటేశ్వరరావు, వెలమల రమేష్ పాల్గొన్నారు.




---

## గౌరీ నాయుడుని సన్మానించిన తెలంగాణ సాహితీవేత్త

**లక్కవరపుకోట, జనవరి 19,( మేజర్ న్యూస్) :**
మండలములోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీ వేత్త, రచయిత, రాచకొండ నరసింహా శర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కిలారి గౌరీ నాయుడుని తెలంగాణ సాహితీవేత్త, ప్రజా కవి అందెశ్రీ విశాఖ పట్నంలో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి అలాగే అక్కినేని నాగేశ్వరావు శతజయంతి ముగింపు కార్యక్రమంలో తనను సన్మానించారు అని గౌరి నాయుడు తెలిపారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక, కళా రంగాలలో గౌరీ తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ సత్కారం జరిగింది అన్నారు . అందెశ్రీ గోరేటి వెంకన్న, వంగపండు ప్రసాద్, ప్రజా గాయకుడు గద్దర్ లాంటి సుప్రసిద్ధ ప్రజాగేయ రచయితలు రచించిన పాటలను ఆలపించి ప్రజలను చైతన్యవంతం చేయటానికి సాహిత్య సంస్థల ద్వారా



రెండు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్నాట్లు వక్తలు పేర్కొన్నారన్నారు అందెశ్రీ రచించిన మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు అనే పాటను ఇప్పటి వరకు వంద సాహిత్య, సాంస్కృతిక సభలలో పాడి ప్రజలను చైతన్యవంతం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ సాహితీవేత్త అందెశ్రీ గౌరీ నాయుడుని ప్రత్యేకంగా అభినందిస్తూ సన్మానించినట్లు తెలిపారు . లోక కవిగా, ప్రకృతికవిగా, ప్రసిద్ధిగాంచిన అందెశ్రీ సత్కరించడం నాపై మరింత బాధ్యతను పెంచిందని గౌరీ నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌరీ నాయుడు మాట్లాడుతూ డిగ్రీలకు అతీతమైన పాండిత్యాన్ని సంపాదించిన గొప్ప కవిగా అందెశ్రీ సాహిత్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని గౌరీ నాయుడు పేర్కొన్నారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ జాతి గీతంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని గౌరీ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత గౌరీ నాయుడుని అభినందిస్తూ స్నేహితులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, అభినందనలు తెలిపారు.

---

## గ్రామాల్లో పశువైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోండి

**కోటబొమ్మాళి, జనవరి 19, మేజర్ న్యూస్:**
రాష్ట్ర వ్యవసాయ, మత్స్యకార, పాడి పరిశ్రమ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు గ్రామాల్లో పశువైద్య శిభిరాలు నిర్వహించటం జరుగుతుందని దీనిని పాడిరైతులు స్వదినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లుతో



మాట్లాడుతూ ప్రతిరోజు రెండు గ్రామాల్లో ఈ వైద్య శిభిరాలు నిర్వహించటం జరుగుతుందని, వైద్య శిభిరం నిర్వహించిన ముందురోజు ఆయా గ్రామాల్లో దండోర వేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వైద్య శిభిరంలో పశువులలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ, అమ్మవారు, కోళ్లలో కొక్కెర వ్యాధులతో పాటు వ్యాధులకు ఇద్దరు పశువైద్యాధికారుల పర్యవేక్షణలో నివారణ టీకాలు వేయటం జరుగుతుందన్నారు. అలాగే అనారోగ్యంగా ఉన్న పశువులకు, చూడి పరీక్షలు చేయటం జరుగుతుందని, గతంలో జబ్బువాపు, గొంతువాపు, ముద్ద చర్మవ్యాధి, గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయని పశువులకు టీకాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**- వాహన చోదకులు కు అవగాహన కలిగిస్తున్న పట్టణ సిఐ సతీష్**

**బొబ్బిలి, జనవరి 19,మేజర్ న్యూస్:**
రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పట్టణ సిఐ కె సతీష్ కుమార్ తెలిపారు.ఈ మేరకు ఆదివారం జాతీర రోడ్ల భద్రత వారోత్సవాల సందర్భంగా పాత బొబ్బిలి కూడలి వద్ద వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాల పై అవగాహన కలిగించేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం మంచిది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ ఐ తో పాటు గాంధీ స్మారక నిధి బాలల సభ్యులు పాల్గొన్నారు.



---

# అధికారి పార్టీలో గోశాలలు మంజూరి లొల్లి..!

- అధికారి పార్టీలో గోశాలలు మంజూరి లొల్లి..!
- పని చేస్తావా! పోతావా! అధికారి పార్టీ హుకుమ్..?
- దీంతో నిభందనలుతో పని లేకుండా అడ్డుగోలు అనుమతులు.!
- అక్రమాలపై సమాచార హక్కు కింద కొందరు దరఖాస్తు.!

**మెరకముడిదాం జనవరి 19 న్యూస్ మేజర్**
అధికార పార్టీ నాయకుల హుకుం తో గోశాలల మంజూరిలో మరలా లొల్లి మొదలైంది. అక్టోబరు 14 న మొదలైన ఈ లొల్లి కొనసాగుతూనే ఉంది. దీంతో అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. మండల పశు సంవర్ధకశాఖ, ఉపాధి హామీ అధికారులు గిలా, గిలా కొట్టుకుంటున్నారు. గోశాలల మంజూరు వ్యవహారంలో ముందు నుయ్యి, వెనుక గొయ్యి లా అదికారులు పరిస్థితి తయారైంది. గోశాలలకు రూల్స్ ను పక్కన పెట్టి అనుమతులు, ఉన్నా, లేకున్నా మంజూరు ఇచ్చి గ్రౌండింగ్ చేసేయాల్సిందేనని ఒక పక్క అధికార పార్టీ నాయకుల అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తునట్లు సమాచారం. అనుమతులు, గినుమతులు జాంతా నహి! పని చేస్తావా! పోతావా! అన్న దోరణతో వ్యవహరిస్తున్న అధికార పార్టీ నాయకులు తీరుతో గత్యంతరం లేని పరిస్థితిలో పశు సంవర్ధకశాఖ అధికారి పూర్తి స్థాయిలో డాక్యుమెంట్లు లేకుండానే, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉపాధి హామీ శాఖ అధికారులు కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. మరో పక్క గోశాలలు మంజూరులో నిభందనలు ఉల్లంఘిస్తే చిక్కుల్లో పడతారని అధికారులకు కొంత మంది హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలియ వచ్చింది. అధిష్ఠానం పేరు చెప్పి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలూ ఉన్నాయి. చివరకు అదికార పార్టీ ఆదేశాలకే అధికారులు తలొగ్గారు.గత్యంతరం లేని పరిస్థితిలో అధికారులు తప్పులు చేసేందుకు సిద్ధ పడినట్లు తెలిసింది. దీంతో గోశాలల మంజూరులో ప్రభుత్వ ఉత్తర్వులు తుంగలో తొక్కిన అధికారులపై సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని పొంది, అడ్డుగోలు ఆనుమతులపై పోరాడేందుకు కొంత మంది సిద్ధమయ్యారు. దీనికీ సంభందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండలానికి మొదట్లో 26 గోశాలలు మంజూరయ్యాయి. అప్పట్లో వీటిని అదికార పార్టీ లో బడా నేతలు పంచేసుకున్నారు. ఆ నేపథ్యం లో" మేజర్ న్యూస్" లో అక్టోబరు 14 న " గోశాలల మంజూరులో గోల్ మాల్ " పేరుతో సమగ్ర వార్తా కథనం ప్రచురితం అయ్యింది. ఆ వార్తకు స్పందించిన మెరకముడిదాం పశు సంవర్ధకశాఖ వైద్యాదికారిని డాక్టర్ హైమావతి,ఆవార్తలో నిజం లేదని, ఖండించడం జరిగింది. ఇప్పుడు సేమ్ అదే పరిస్థితి రిపీట్ ఆయింది. మరి ఇప్పుడు వస్తున్న ఆరోపణలపై సదరు వైద్యాకారిని ఏవిధంగా స్పందిస్తారో ! వేచి చూడాలి. ఇదిలా ఉండగా అప్పట్లో ఆధికార పార్టీ నాయకులు, కుమ్ములాటతో ఆ సంఖ్యను కాస్తా! 72 కు పెంచారని భోగట్టా! కాగా పాత, కొత్తగా మంజూరు అయిన అన్నింటికీ, అధికార పార్టీ అండతో ప్రభుత్వ ఉత్తర్వులు ను గాలికి వదిలేసి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చేసారని తెలిసింది. ఈ క్రమంలోనే గోశాలల అక్రమాలపై సమాచార హక్కు చట్టం ద్వారా అక్రమాలను వెలికి తీసేందుకు కొంత మంది సమాయత్తం అవుతున్నారు. ఈ పరిణామాలన్నీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో తీవ్ర పరిణామాలు చూపిస్తాయని అధికార పార్టీ నాయకులే చర్చించుకోవడం తో పార్టీ మనుగడకే ప్రమాదమని, నాయకుల్లో ఆందోళన మొదలైందని చెప్పక తప్పదు.

**మెరకముడిదాం పశు వైద్యాధికారి వివరణ:-**
మెరకముడిదాం పశు వైద్యాధికారి డాక్టరు హైమవతి వివరణ కోరగా ఈ విధంగా సమాధానమిచ్చారు. తనకు గోశాలలు మంజూరు కొరకు 71దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో కొన్నింటికి పూర్తి స్థాయిలో డాక్యుమెంట్లు లేవు. అందువలన వాటిని నిలుపుదల చేసేందుకు చూశాను. అయితే నాపై తీవ్ర ఒత్తిడి వచ్చి డాక్యుమెంట్లు ఉన్నా, లేకున్నా, మీకు సంబంధం లేదు. ఉన్నవి ఉన్నట్లు పంపించమని ఆదేశాలు వచ్చాయి. దాంతో నాదగ్గరకు వచ్చిన దరఖాస్తులన్నీ పంపించేసాను. ఆ తరువాత సుమారు 30 వరకూ రిజక్టు అయినట్లు తెలిసిందని డాక్టరు హైమావతి మేజర్ న్యూస్ కు వివరణ ఇచ్చారు.

### గోకులాలు మంజూరులో గోల్ మాల్

- 63 గ్రామాలుంటే 10 గ్రామాలకే సిఫార్సు చేసిన డాక్టర్- ఉపాధి హామీ కార్యాలయంకు చేరిన జాబితా- విమర్శలు రావడంతో ఉత్తుత్తి లిస్టే అంటూ బుకాయింపు

మెరకముడిదాం, అక్టోబరు 14, మేజర్‌న్యూస్:

